ప్రతిపక్షం
www.prathipaksham.in


బుధవారం 19.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 239 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



వన్డే సిరీస్ కు సిద్ధమవుతున్న టీమిండియా 12







విజయవాడలోని కానూరులోని ఓ భవనంలో మావోయిస్టులు షెల్టర్ తీసుకున్నట్లు సమాచారం అందడంతో పోలీసు బలగాలు భారీగా చుట్టుముట్టాయి. సుమారు తొమ్మిది మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో మావోయిస్టు చీఫ్ తిప్పరి తిరుపతి అలియాస్ దేవుజీ, అయన బాడీ గార్డ్స్ ఉన్నారని అంటున్నారు. మరో కీలక నేత సుశీల కూడా ఉన్నట్లు భావిస్తున్నారు. మరో ఆరుగురు మావోయిస్టులు తప్పించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు గాలింపు మొదలు పెట్టారు.

మావోయిస్టు హిడ్మా ఎన్‌కౌంటర్

ఆయన భార్య హేమ కూడా మృతి.. మరో నలుగురు సెక్యూరిటీ కూడా

- అక్కడి నుంచి తప్పించుకున్న ఐదుగురు
- వారి కోసం కొనసాగుతున్న గాలింపు
- ఏపీ రంపచోడవరం ఏజెన్సీలో ఘటన
- మృతదేహాలు ఆస్పత్రులకు తరలింపు
- ధ్రువీకరించిన ఏపీ డీజీపీ హరీశ్ గుప్తా
- పోలీసుల అదుపులో కేంద్ర కమిటీ కార్యదర్శి?!
- విజయవాడలో షెల్టర్ తీసుకున్న 30 మంది
- అందరినీ గుర్తించి అరెస్టు చేసిన పోలీసులు
- వెంటనే వదిలిపెట్టాలని న్యూడెమొక్రసీ డిమాండ్

ప్రతిపక్షం ప్రతినిధులు

విశాఖపట్నం, కరీంనగర్, నవంబర్ 18: నక్సల్స్ మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత మడావి హిడ్మా,(43) ఎదురు కాల్పులలో చనిపోయారు. అతని భార్య హేమ కూడా ఈ ఘటనలో మృతి చెందారు. ఏపీలోని అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ మారేడుమిల్లి అడవులలో ఏపీ, తెలంగాణ సరిహద్దులలో ఈ భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఏపీ డీజీపీ హరీశ్ గుప్తా ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు. మంగళవారం నాడు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల మధ్య పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. సరిహద్దు అడవులలో మావోయిస్టుల కదలికలు పెరిగినట్టుగా సమాచారం అందుకున్న పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. అడవిలో మావోయిస్టులు ఎదురుపడి కాల్పులు జరపగా, పోలీసులు కూడా తిరిగి ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో హిడ్మా, హేమతోపాటు వీరికి సెక్యూరిటీగా ఉన్న నలుగురు మావోయిస్టులు చనిపోయారు. కాగా, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పరి తిరుపతి, మరికొంత

..:: మిగతా 2లో

దేశాభివృద్ధిలో తెలంగాణ వాటా

అందుకు కేంద్రం సహకరించాలి



- వికసిత్ భారత్ లో మేమూ భాగమవుతాం
- అభివృద్ధిలో అందరం కలిసి పని చేయాలి
- బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఎదగాలి
- ప్రధాని మోడీ 'బడే భాయ్'లా అండగా ఉండాలి
- డిసెంబర్ 9 వ తేదీన రాష్ట్ర విజన్ డాక్యుమెంట్
- బృహత్ ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం
- 2047 నాటికి ప్రపంచంలోనే ప్రఖ్యాతి సాధించాలి
- రాష్ట్రాల ప్రాంతీయ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 18 : ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా భారత్ ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంలో తెలంగాణ కూడా భాగస్వామ్యం కావాలని బలంగా ఆకాంక్షిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి సంపూర్ణ సహకారం, మద్దతు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్ డ్యూల పట్టణాభివృద్ధి శాఖ మంత్రుల ప్రాంతీయ సదస్సును కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ హైదరాబాద్ లో మంగళవారం ప్రారంభించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మన దేశం స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాల పూర్తి చేసుకునే 2047 నాటికి ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా, ఆర్థికంగా

..:: మిగతా 2లో



ఈసీ తన విశ్వసనీయతను నిరూపించుకోవాలి

తాము జేపీ కనుసన్నలలో పనిచేయడం లేదని కేంద్ర ఎన్నికల సంఘం నిరూపించుకోవాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఈసీ ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ తీవ్ర అభ్యంతరకంగా ఉందని ఆరోపించారు.

11



నేను ఓ 'బలిదాన' ఆపరేషన్ చేస్తున్నా

ఎర్రకోట ప్రాంతంలో ఈ నెల పదిన జరిగిన భీకర కారు పేలుడు ఘటనలో అభిస్తున్న ప్రతి క్లూ దర్యాప్తును కీలక దశకు తీసుకెళ్తోంది. తాజాగా దాడికి కొన్ని క్షణాల ముందు ఉమర్ ఉన్ నబీ రికార్డ్ చేసిన అన్‌సీన్ వీడియో బయటకు వచ్చింది.

11



'మదీనా' బాధితులకు అండగా ప్రభుత్వం

- సౌదీకి చేరిన మంత్రి అజారుద్దీన్ బృందం
- జెడ్డాలో స్థానిక అధికారులతో ప్రత్యేక భేటీ
- మృతులకు అక్కడే అంత్యక్రియలు జరిగే అవకాశం
- మదీనాలో భారత కాన్సులేట్ శిబిర కార్యాలయం

ప్రతిపక్షం ప్రత్యేక ప్రతినిధి

మదీనా (సౌదీ అరేబియా), నవంబర్ 18 : సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన 45 మంది ఉమ్రా యాత్రికుల కుటుంబాలకు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ నాయకత్వంలో మంగళవారం మదీనా నగరానికి చేరుకుంది. ఇందులో

..:: మిగతా 2లో

పత్తి రైతుల సమస్యలు తీరేదాకా పోరాటం

- 'కపాస్' యాప్‌ను ఉపసంహరించుకోవాలి
- తేమ శాతం 13 కు కచ్చితంగా పెంచి తీరాలి
- వాటితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు
- వారిని ఇంకా ఎన్నాళ్లు రాచి రంపాన పెడతారు
- సీసీఐ అధికారులకు మాజీ మంత్రి కేటీఆర్ వినతి



ప్రతిపక్షం బ్యూరో, ఆదిలాబాద్

నవంబర్ 18: పత్తి రైతులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్న 'కపాస్' యాప్‌ను సీసీఐ వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆయన పార్టీ సీనియర్ నాయకులతో కలిసి అదిలాబాదులో సీసీఐ అధికారులను కలిసి పత్తి రైతుల సమస్యల మీద వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొంటామంటూ పెట్టిన నిబంధనను వెంటనే తొలగించాలని, తేమ శాతం 20 వరకు ఉన్న పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్ కపుల్స్ ఆప్ ను సీసీఐ సరైన శిక్షణ, అవగాహన లేకుండా, ఆకస్మికంగా ప్రవేశపెట్టడం వలన కొనుగోళ్లలో అనవసరమైన జాప్యం జరుగుతోందని తెలిపారు. ఆదిలాబాద్‌లో రైతన్నలందరికీ స్మార్ట్ ఫోన్లు ఉండాలనే నిబంధన లేదని, కనెక్టివిటీ సరిగా లేదని, శిక్షణ లేని కారణంగా ఈ యాప్ తో రైతులకు

..:: మిగతా 2లో



పోలీసుల అదుపులో జసీర్ బిలాల్

ఢిల్లీ బాంబు పేలుడు కేసులో డాక్టర్ ఉమర్‌కు సహకరించిన జసీర్ బిలాల్ వాని అలియాస్ డానిష్ అనే వ్యక్తిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. ఇతను ఉమర్ నబీతో కలిసి ఉగ్రవాద కుట్రలకు పాల్పడినట్టి అధికారులు గుర్తించారు.

11



2015–2016లో గ్రూప్ 2 పరీక్ష రద్దు

- నిబంధనలు ఉల్లంఘించారన్న హైకోర్టు
- పునర్ మూల్యాంకనం చేయాలని ఆదేశం
- ఆ తరువాతే అర్హుల జాబితా రూపొందించాలి
- టీఎస్పీఎస్సీకి స్పష్టం చేసిన ధర్మాసనం

..:: 3లో



చట్టపరంగానే 42 శాతం కావాలి

- పార్టీలు ఇచ్చే వాటా బిక్షం మాకొద్దు
- రిజర్వేషన్లు ఖరారు కాకుండా ఎన్నికలు వద్దు
- కాంగ్రెస్, బీజేపీకి తగిన గుణపాఠం చెబుతాం
- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- మీడియాతో జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జు కృష్ణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 18 : చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఖరారు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంఘాలు నినదించాయి. చట్టపరంగా రిజర్వేషన్లు ఖరారు కాకుండానే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పున: పరిశీలించాలని బీసీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ పరంగా ఇచ్చే బిక్ష బీసీ సమాజం అంగీకరించబోదని స్పష్టం

..:: మిగతా 3లో

డిజిటల్ విశ్వవిద్యాలయంగా అంబేడ్కర్ వర్సిటీ

- కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ (సీఓఎల్)తో ఒప్పందం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

..:: 3లో





మా తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తున్నారు

తేజస్వి యాదవ్ సహాయకులు తమ కుటుంబాన్ని, పార్టీని ముక్కలు చేస్తున్నారని, అలాంటి ద్రోహులతో తమ తల్లిదండ్రులు మానసిక వేధింపులకు గురవుతున్నారని తేజ్ ప్రతాప్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.

11



కోటి మంది మహిళలకు కోటి చీరలు

- అర్హులైన ప్రతీ మహిళకు పంపిణీ
- నేడు ఇందిర జయంతి సందర్భంగా షురూ
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : కోటి మంది మహిళలకు కోటి చీరలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంగళవారం ఆయన మంత్రి సీతక్కతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు. చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరలు పంపిణీ చేయాలని, సూచించారు. తొలి దశలో గ్రామీణ ప్రాంతాలలో పంపిణీ చేయాలని నిర్ణయించారు. డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాలలో మార్చి ఒకటి నుంచి మార్చి ఎనిమిది అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. చీరల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, నాణ్యమైన చీరలను అందించాలని ఆదేశించారు. చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీరల పంపిణీని ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. ఈ సమీక్షలో సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ హ్యాండ్లూమ్స్ శైలజా రామయ్యర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, సెర్ప్ సీఈవో డి.దివ్య తదితరులు పాల్గొన్నారు.



పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులలో ఉన్నారు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు
- మక్క రైతులకూ అవస్థలు తప్పడం లేదు
- ఎనుమాములలో హరీశ్ రావు

ప్రతిపక్షం బ్యూరో, వరంగల్, నవంబర్ 18: రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. మంగళవారం ఆయన ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండూ రైతులను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాలలో పత్తి సాగు జరుగుతోందని, సీసీఐ తీసుకుంటున్న నిర్ణయాలు రైతులను రోడ్డున పడేస్తున్నాయని విమర్శించారు. కపాస్ యాప్, తేమ శాతం పరిమితులు, ఎల్1చ ఎల్2, ఎల్3 వంటి నిర్ణయాల వల్ల రైతులకు కొనుగోలు కేంద్రాలలో సమస్యలు పెరిగాయని పేర్కొన్నారు. రెండు రోజులుగా జిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయని, కనీస మద్దతు ధర 8,100 రూపాయలైనా, రైతులు 6,000 రూపాయలకు పత్తిని అమ్ముకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. అటు కేంద్రం, రాష్ట్రం మాటలలో మాత్రమే రైతులకు భరోసా ఇస్తున్నాయని, అమలులో మాత్రం విఫలమవుతున్నాయని విమర్శించారు. దిగుమతి సుంకాలు ఎత్తివేయడం వల్ల దేశీయ పత్తి రైతులకు పెద్ద నష్టం కలిగిందని, దీని వల్ల దళారులు, పెద్ద కంపెనీలకే లాభం జరుగుతోందని ఆయన ఆరోపించారు. మక్క రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2,400 రూపాయల మద్దతు ధర ఉన్న మక్కను 1,800 రూపాయలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వమే మార్క్‌ఫెడ్‌కు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని అన్నారు. హరీశ్ వెంట పార్టీ నాయకులు మధుసూదనాచారి, రాజయ్య, ఎర్రబెల్లి దయాకర్ రావు, పెద్ది సుదర్శన్ రెడ్డి, వినయ భాస్కర్, రాకేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీనియర్ నేతలను వదిలేశారు

- కేసీఆర్ కూడా తప్పులు చేశారు
- బీఆర్ఎస్ ఓటమికి అదే కారణం
- 'ఖమ్మం' జనం బాటలో జాగృతి కవిత గర్జన



ప్రతిపక్షం బ్యూరో, ఖమ్మం, నవంబర్ 18: బీఆర్ఎస్ వరుసగా మూడుసార్లు ఓడిపోవడానికి తుమ్మల నాగేశ్వరరావు వంటి అనుభవజ్ఞులైన నేతలను వదిలేయడమేనని కవిత కవిత స్పష్టం చేశారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ వంటి అనుభవజ్ఞులే తప్పులు చేశారని, తాను కూడా చాలా నేర్చుకోవాల్సి ఉందని భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం రాజకీయ పార్టీ స్థాపన గురించి ఆలోచన లేదని, ప్రజల సమస్యలపై పోరాటమే తమ ప్రాధాన్యమని చెప్పారు. బీఆర్ఎస్‌తో తనకు సంబంధం లేదని, 20 యేండ్లు పార్టీ కోసం పనిచేసిన తర్వాత కుట్ర చేసి తనను పార్టీ, కుటుంబం రెండింటి నుంచి దూరం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పేరు చెబితేనే ప్రజలు తిట్టే పరిస్థితి ఉందని, అలాంటి పార్టీ జూబ్లీహిల్స్‌లో ఎలా గెలిచిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యాలే ఇందుకు కారణమన్నారు. దేశవ్యాప్తంగా కూడా కాంగ్రెస్ విపక్ష బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైందని పేర్కొన్నారు. పార్టీవారీగా బీసీలకు సీట్లిస్తామని ముఖ్యమంత్రి చెప్పడం బీసీలను మోసం చేయడమేనన్నారు. కాకర్లపాడు గ్రామంలో సామినేని రామారావు హత్యపై పోలీసుల నిర్లక్ష్యాన్ని కవిత తప్పుబట్టారు. ప్రజలకు ఉపాధి, అభివృద్ధి, సామాజిక న్యాయం అందే వరకు జాగృతి పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

కోడిగుడ్ల సరఫరాలో జాప్యం వద్దు

- నెలలో మూడుసార్లు పంపిణీ చేయాలి
- గుడ్డు సైజు తగ్గిస్తే ఊరుకునేది లేదు
- నాసి రకం వస్తువులు ఇస్తే కఠిన చర్యలు
- గుడ్ల సరఫరాదారులకు మంత్రి సీతక్క హెచ్చరిక



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : నిరుపేదలలో రక్తహీతన తగ్గించేందుకు ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంలో జాప్యం చేస్తే సహించేది లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. వెంగల్ రావునగర్ మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ లో అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు, పప్పు, మంచి నూనె, పాలు, ఇతర న సరుకులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరాలో జరుగుతున్న జాప్యంపై సీరియస్ అయ్యారు. 'మాకు కారణాలు చెప్పకండి. చిన్నారుల కోసం కోడి గుడ్లు పది రోజులకు ఒకసారి తప్పనిసరిగా సరఫరా కావాలి. సాకులు చెప్పి జాప్యం చేస్తే కాంట్రాక్టులు రద్దు చేస్తాం' అని స్పష్టం చేవారు. నాణ్యమైన, నిర్దిష్ట సైజు గుడ్లను సరఫరా చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. సరుకుల నాణ్యతలో లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అయితే, గుడ్ల సరఫరాదారులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. హాస్టల్స్‌తో కలిపి సరఫరా చేయడంతో సమన్వయం కుదరక కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని, కొన్ని సందర్భాలలో అంగన్వాడీ కేంద్రాలకు కేటాయించిన గుడ్లను హాస్టల్ నిర్వాహకులు ఒత్తిడి చేసి తీసుకుంటున్నారని వివరించారు. అటు అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అయ్యే జిలకర, ఆవాలు, పసుపు, ఉప్పు, కారం పొడి, చింతపండు వంటి వస్తువుల నాణ్యత ఆశించిన స్థాయిలో లేక పోవడాన్ని మంత్రి సీతక్క తీవ్రంగా పరిగణించారు. నాసిరకం వస్తువులు ఇస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శ్రుతి ఓజా, టీజీ ఫుడ్స్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మావోయిస్టు హిడ్మా ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి

మంది నాయకులను అరెస్టుచేసి, చిత్రహింసలు పెడుతున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. తిరుపతి, తదితర నాయకులకు ప్రాణహాని తలపెట్టకుండా, వారి అరెస్టులను బహిరంగంగా ప్రకటించాలని కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి సూర్యం డిమాండ్ చేశారు.

అరెస్టులను వెంటనే ప్రకటించాలి

'ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మడావి హిడ్మా, మరో ఐదుగురిని విజయవాడ ప్రాంతంలో అరెస్టుచేసి, చిత్రహింసలు పెట్టి, అత్యంత కిరాతకంగా చంపి, తూర్పు గోదావరి జిల్లాలోని మారేడుమిల్లి అడవులలో శవాలను పడవేసి ఎన్‌కౌంటర్ కథలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రచారం సాగిస్తూ వున్నది. హిడ్మా, మరో ఐదుగురిని ఎన్ కౌంటర్ పేరిట హత్య చేయటాన్ని' ఖండిస్తున్నామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పేర్కొంది. హిడ్మా తదితరులను ఎన్కౌంటర్ పేరిట కాల్చి చంపడంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

పోలీసుల అదుపులో కీలక నేతలు

విజయవాడలోని కానూరులోని ఓ భవనంలో మావోయిస్టులు షెల్టర్ తీసుకున్నట్లు సమాచారం అందడంతో పోలీసు బలగాలు భారీగా చుట్టుముట్టాయి. సుమారు తొమ్మిది మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో మావోయిస్టు చీఫ్ తిప్పరి తిరుపతి అలియాస్ దేవుజీ, ఆయన బాడీ గార్డ్స్ ఉన్నారని అంటున్నారు. మరో కీలక నేత సుశీల కూడా ఉన్నట్లు భావిస్తున్నారు. మరో ఆరుగురు మావోయిస్టులు తప్పించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు గాలింపు మొదలు పెట్టారు.

అడవుల నుంచి బెజవాడకు

అడవులలో ఉంటే వెంటపడి కాల్చి చంపుతున్నారని మైదాన ప్రాంతాలకు మావోయిస్టులు మకాం మారుస్తున్నారు. వారిలో ఎక్కువ మంది చత్తీస్ ఘడ్ నుంచి విజయవాడకు వచ్చారు. ఆటోనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవంతిలో 30 మందికిపైగా షెల్టర్ తీసుకున్నారు. వారందరినీ గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. హిడ్మా ఎన్‌కౌంటర్ కావడంతో వీరి గురించి సమాచారం బయటకు వచ్చింది. ఒక్క విజయవాడలోనే కాదని, ఏపీలో పలు చోట్ల షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించారు. కాకినాడలోనూ ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఎక్కువ మంది మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ సెక్యూరిటీ అని తెలిసింది. దేవ్ జీ ఎక్కడ ఉన్నారన్నది తేలాల్సి ఉంది. దొరికినవారంతా మాడ్వీ హిడ్మా దళానికి చెందిన వారేనని ఏపీ ఇంటలిజెన్స్ చీఫ్ లడ్హా ప్రకటించారు. వారి నుంచి మరింత సమాచారం సేకరించి పారిపోయిన మావోయిస్టులను పట్టుకుంటామన్నారు. అయితే, ఎవరికీ అనుమానం రాకుండా విజయవాడకు వచ్చి షెల్టర్ తీసుకోవడమే అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. మావోయిస్టులకు సహకరిస్తున్న 31 మందిని అదుపులోకి తీసుకున్నామని, ఇంకా మరో 26 మందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని అడిషనల్ డీజీ తెలిపారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

దేశాభివృద్ధిలో తెలంగాణ వాటా

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు నడిపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు తమ వంతుగా భాగస్వామ్యం కావడానికి తెలంగాణ ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతోందని చెప్పారు. దేశం ప్రగతిలో మెట్రో పాలిటన్ నగరాలు ఎన్నో రకాలుగా తోడ్పాటునందిస్తున్నాయన్నారు. దేశంలో వ్యవసాయ రంగంతో పాటు పట్టణీకరణ కూడా చాలా ముఖ్యమని ప్రత్యేకించి మెట్రో పాలిటన్ సిటీల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకురావాలని సూచించారు.

బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా

బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఎదగడంలో పది శాతం మేరకు తెలంగాణ నుంచి దోహదపడాలని నిర్దేశించామని సీఎం చెప్పారు. ఆ లక్ష్యాల సాధన కోసం తెలంగాణ రైజింగ్ 2047 బృహత్ ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. డిసెంబర్ 9 వ తేదీన ఆ విజన్ డాక్యుమెంట్ ను ప్రజలకు అంకితం చేయబోతున్నామని వెల్లడించారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలని నిర్దేశించుకున్నామన్నారు. ఆ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రం తలపెట్టిన ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు మంజూరు చేస్తే మరింత వేగంగా ముందుకు వెళ్లగలమన్నారు. హైదరాబాద్ నగరానికి ఓ ప్రత్యేకత ఉందని, మిశ్రమ సంస్కృతి, మంచి వాతావరణం కలిగి ఉంటుందని అన్నారు. అంబేద్కర్ హైదరాబాద్ ను రెండో రాజధాని చేయాలన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రధానంగా మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, నగరానికి గోదావరి జలాల తరలింపు, కాలుష్య నివారణలో భాగంగా ప్రస్తుతం నగరంలో డీజిల్ తో నడుస్తున్న మూడు వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, సివరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లు వంటి అనేక ప్రాజెక్టులు చేపట్టామన్నారు.

ప్రధాని బడా భాయ్ లాంటి వారే

దేశ ప్రధానమంత్రి రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బడా భాయ్ లాంటి వారేనని. మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, తాగునీటి సమస్య, కాలుష్య నియంత్రణ వంటి అనేక విషయాలపై దృష్టిని సారించి రాష్ట్రానికి సహకరించాలని మోడీ కోరారు. రాజకీయాలు చేయాల్సినపుడు రాజకీయాలు మాట్లాడొచ్చని, రాజకీయాలు ఇప్పుడు అసందర్భమని చెప్పారు. 'గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ప్రభుత్వాలు వేరైనప్పటికీ విధానాలను అమలు చేయడంలో మార్పులేదు. కాకపోతే వాటిని మరింత పదును పెట్టి అమలు చేయడం జరిగింది' అని ముఖ్యమంత్రి చెప్పారు. పట్టణాభివృద్ధి విషయంలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న అంశంపై పలు రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖల సమావేశం హైదరాబాద్ లో ఏర్పాటు చేసినందుకు కేంద్ర మంత్రి కట్టర్ కు అభినందనలు తెలియజేశారు.

'మదీనా' బాధితులకు అండగా ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫియుల్లా, ఏఐఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఉన్నారు. వీరు సౌదీ అధికారులు, జెద్దాలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంతో సమన్వయంతో వివరాలు తెలుసుకుంటున్నారు. జెద్దాలోని భారత కాన్సుల్ జనరల్ ఫహద్ అహ్మద్ ఖాన్‌తో సమావేశమయ్యామని మంత్రి అజారుద్దీన్ చెప్పారు. మృతుల కుటుంబాల ఆకాంక్షలకు అనుగుణంగా గౌరవప్రదంగా అన్ని కార్యక్రమాలు పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ఈ కష్టకాలంలో వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన యాత్రికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మతపర సంప్రదాయాల ప్రకారం మృతుల అంత్యక్రియలు సౌదీ అరేబియాలోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశ నిర్ణయం మేరకు ఈ ఉన్నత స్థాయి బృందాన్ని సౌదీకి పంపారు. బాధితులకు సహాయం అందించేందుకు జెద్దాలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం మదీనాలో ఒక క్యాంప్ ఆఫీసును కూడా ఏర్పాటు చేసింది.



పత్తి రైతుల సమస్యలు తీరేదాకా పోరాటం

మొదటిపేజీ తరువాయి

లాభం కంటే నష్టమే ఎక్కువని అన్నారు. యేటా ఈ సమయానికి ఐదు లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసే సీసీఐ, ఈసారి లక్ష క్వింటాళ్లు కూడా కొనుగోలు చేయలేదని రైతులు చెబుతున్నారన్నారు. కాబట్టి పాత పద్ధతిలోనే మార్కెట్ యార్డుకు వచ్చి నేరుగా అమ్ముకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

వచ్చే యేడాది నుంచి ముందుగానే

యాప్‌ను కొనసాగించాలనుకుంటే, వచ్చే యేడాది నుంచి ముందుగానే రెండుమూడు నెలల పాటు రైతులకు శిక్షణ, ఓరియంటేషన్ ఇవ్వాలని కేటీఆర్ సూచించారు. రెండవ ప్రధాన సమస్యగా తేమ శాతం నిబంధనను కేటీఆర్ ప్రస్తావించారు. ఈ యేడాది ఆదిలాబాద్‌లో భారీ వర్షపాతం, నవంబర్ 18 నాటికి 6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడంతో, పత్తిలో తేమ శాతం సహజంగానే ఎక్కువగా ఉంటుందని వివరించారు. కేంద్రం విదేశాల నుండి పత్తి దిగుమతి చేసుకోవాలని ఒప్పందాలు కుదుర్చుకోవడంతో దేశీయ పత్తి రైతులు ఆగమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 8 నుండి 12 శాతం మధ్య తేమ ఉంటేనే కొంటామని, తేమ పెరిగే కొద్దీ ధర తగ్గిస్తామని సీసీఐ అధికారులు నిబంధన పెట్టడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఏడు క్వింటాళ్లే కొంటామని నిబంధన పెట్టడం సరికాదని, దీనిని 13 క్వింటాళ్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. సీసీఐ సతాయిస్తుంటే, ప్రయివేట్ వ్యాపారులు కూడా మిల్లులు మూసివేసి నిరవధిక సమ్మెకు పోయారని, దీంతో రైతులు ఎవరికీ అమ్ముకోలేని దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, రైతుబంధు, రుణమాఫీ వంటివి సక్రమంగా అమలు చేయకుండా, కనీసం యూరియా, విద్యుత్తు కూడా సరిగా ఇవ్వకుండా, పండించిన పంటకు మద్దతు ధర, సరైన కొనుగోలు కూడా చేయకుండా రైతులను ఇంకా ఎంత రాచి రంపాన పెడతారని ప్రశ్నించారు.





సోషల్ మీడియాలో ట్రోలింగులు ఆపండి

- నగర సీపీ సజ్జనార్ కు మహిళా జర్నలిస్టుల వినతి
- మహిళా కమిషన్ కు కూడా విజ్ఞాపన సమర్పణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : మహిళా జర్నలిస్టులపై ఆన్‌లైన్‌లో వస్తున్న బెదిరింపులు, దుర్భాషలపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ హామీ ఇచ్చారు. స్వతంత్ర జర్నలిస్టు తులసి చందు సహా పలువురు మహిళా జర్నలిస్టులు మంగళవారం కమిషనర్‌కు ఫిర్యాదు సమర్పించారు. తమపై జరుగుతున్న నిరంతర ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులు, అసభ్య దాడుల వివరాలను వారు అందించారు. జర్నలిస్టుల ప్రతినిధి బృందం అనేక వీడియోలను కమిషనర్‌కు ప్లే చేసి చూపించింది. నిరంతరం విద్వేష వ్యాఖ్యలు, అసభ్య పోస్టులు, దాడులు చేస్తూ మహిళా జర్నలిస్టులను అవమానించాలని, భయపెట్టాలని చూస్తున్నారని వారు తెలిపారు. కొన్ని హ్యాండిల్లు ఉద్దేశపూర్వకంగా అసభ్య వ్యాఖ్యలు, ప్రాణహానికర బెదిరింపులు, అవహేళనాత్మక పోస్టులు, వీడియోలు షేర్ చేస్తున్నాయని చెప్పారు. తమ నివాస చిరునామాలు తెలుసునని కొందరు బహిరంగంగా చెప్పిన విషయాన్ని కూడా వారు ఫిర్యాదులో చేర్చారు. ఈ ట్రోలింగ్ భయం కలిగించడం, తమ వృత్తిపర పనిని అడ్డుకోవడమే లక్ష్యంగా కనిపిస్తోందని వారు పేర్కొన్నారు. విద్వేషపూరిత, మతపర ఉద్రిక్తత కలిగించే కంటెంట్‌ను కూడా విస్తృతంగా పోస్ట్ చేస్తున్నాయని తెలిపారు. దర్యాప్తు చేసి, ఐపీసీ, ఐటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆన్‌లైన్-భౌతిక రక్షణను కల్పించాలని కోరారు. ఈ వేధింపులు మీడియా స్వేచ్ఛపై దాడి మాత్రమేనని, మహిళా జర్నలిస్టుల గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు.

పథకం ప్రకారమే అసభ్యకర పోస్టులు

మహిళా జర్నలిస్టులపై సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న బెదిరింపులు, అసభ్యకర పోస్టులు, దుర్భాషలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద హామీ ఇచ్చారు. మంగళవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీతో పాటు మహిళా జర్నలిస్టుల ప్రతినిధి బృందం కమిషన్ చైర్ పర్సన్ ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న నిరంతర ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులు, అసభ్య దాడుల వివరాలను వారు అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ప్రతినిధి బృందం ట్రోలింగ్ స్వరూపాన్ని చూపించే వీడియోలను చైర్ పర్సన్ కు ప్లే చేసి చూపించింది. పలు సోషల్ మీడియా హ్యాండిల్లు నిరంతరం విద్వేష వ్యాఖ్యలు, అసభ్య పోస్టులు, దాడులు చేస్తూ మహిళా జర్నలిస్టులను అవమానించాలని, భయపెట్టాలని చూస్తున్నాయని వారు తెలిపారు.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇచ్చే సమాధానాలను గుడ్డిగా నమ్మవద్దు. ఏఐ కూడా తప్పులు చేసే అవకాశం ఉంది. ఇతర టూల్స్‌లో సమాచారాన్ని వెరిఫై చేసుకోవాలి. విభిన్న మాధ్యమాలతో కూడిన సమాచార వ్యవస్థ ఉండటం ముఖ్యం. ఏఐ పెట్టుబడుల 'బబుల్' ఏ దశలోనైనా విస్ఫోటనం చెందవచ్చు. ఈ విషయంలో కంపెనీలు అప్రమత్తంగా ఉండాలి.

- బీబీసీ ఇంటర్వ్యూలో ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్

ఊపిరి ఆగకూడదంటే సిగరెట్లు ఆపాలి!

- పొగతాగేవారిలోనే ఎక్కువగా సీఓపీడీ
- రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపిఎస్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : 'క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) అనేది ఎక్కువకాలం పాటు పొగ తాగడం, లేదా పీల్చడం వల్ల ఊపిరితిత్తులలో వచ్చే తీవ్ర సమస్య. దీనిని పూర్తిగా నయం చేయడం దాదాపు సాధ్యం కాదు. మధుమేహం, రక్తపోటు లాంటివి మన చేతులలో లేని, మనం నియంత్రించలేని వ్యాధులు. అదే సీఓపీడీ అయితే మనం సిగరెట్లు కాల్చకుండా ఉంటే చాలు. మన దరి చేరదు. కాలుష్యం బారిన పడకుండా, పొగ తాగకుండా ఉంటే చాలావరకు పెద్దవయసులో ఈ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు. ఊపిరి ఆగిపోకుండా ఉండాలంటే సిగరెట్లు కాల్చడం ఆపాల్సిందే' అని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు తెలిపారు. అంతర్జాతీయ సీఓపీడీ డే సందర్భంగా ఎల్బీ నగర్ కామినేని ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఓపీడీని వీలైనంత ముందుగా గుర్తిస్తే అప్పటివరకు ఊపిరితిత్తులకు అయిన నష్టాన్ని కొంతవరకైనా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. 'సీఓపీడీ డే సందర్భంగా కామినేని హాస్పిటల్స్ వారు ఈ నెల 22వ వరకు రూ.400కే పరీక్షను, పల్మనాలజిస్టు కన్సల్టెన్సీ అందిస్తున్నారు. పొగతాగే అలవాటు ఉన్నవారు, ఇప్పటికే ఇబ్బంది పడుతున్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మీ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డా. రవీందర్ రెడ్డి తదితరులు మాట్లాడారు.



డిజిటల్ విశ్వవిద్యాలయంగా అంబేడ్కర్ వర్సిటీ

- కామన్వెల్త్ఆఫ్‌లెర్నింగ్ (సీఓఎల్)తో ఒప్పందం
- కీలక నాలెడ్జ్ హబ్‌గా ఓపెన్ యూనివర్సిటీ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటుకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, కామన్వెల్త్ ఆఫ్‌లెర్నింగ్ (సీఓఎల్)తో ముఖ్యమంత్రి సమక్షంలో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలోని వర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం వివరించారు. ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందనున్న బీఆర్ ఏఓయూ బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి ఐడియా అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పని చేస్తుందన్నారు. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అందించనున్నబీఆర్ ఏఓయూ తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు, సీఈఓ పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, బీఆర్‌ఏఓయూ వైస్ చాన్స్ లర్ ఘంటా చక్రపాణి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చట్టపరంగానే 42 శాతం కావాలి

మొదటిపేజీ తరువాయి

చేసింది. బీసీ రిజర్వేషన్ చట్టబద్ధంగా అమలు చేయకపోతే, కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలను ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడతామని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, జేఏసీ చీఫ్ కోఆర్డినేటర్ గుజ్జు కృష్ణ హెచ్చరించారు. మంగళవారం హైదరాబాదులోని హోటల్ అభినంద గ్రాండ్ లో జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ , గుజ్జు కృష్ణ మాట్లాడారు. సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని, పార్టీ పరంగా 42 శాతం బీసీ అభ్యర్థులను నిలపాలని నిర్ణయించడాన్ని రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బీసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు, ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడాకపోతే రాష్ట్రంలో అగ్గిపుట్టిస్తామని శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసిన మూడు గంటలలోనే ఇటు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలకు వెళ్తామని ప్రకటించడాన్ని బట్టి చూస్తే బీజేపీ కాంగ్రెస్ కుమ్మక్కై అడ్డుకుంటున్నారని అర్థమవుతోందని ఆరోపించారు. ఇందుకు నిరసనగా బుధవారం నుంచి ఆందోళన నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, రామకృష్ణ, బీసీ నేతలు నందగోపాల్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, నరసింహ నాయక్, గొడుగు మల్లికార్జున్ ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, ఉదయనేత, మల్లికార్జున యాదవ్, పానుగంటి విజయ్, గూడూరు భాస్కర్ మేరు, నరసింహ చారి, లచ్చ గౌడ్, కవుల జగన్నాథం, కవిత, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పోలవరం, బనకచర్లకు మేం వ్యతిరేకం

- వాటికి ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దు
- ఆల్మట్టి ఎత్తు పెంచడాన్ని వెంటనే ఆపండి
- జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కు మంత్రి ఉత్తమ్ వినతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 18: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించాలనుకున్న పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు తాము వ్యతిరేకమని, ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని తెలంగాణ నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ను కోరారు. మంగళవారం ఆయన ఢిల్లీలో కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ కొంత కాలం నుంచి జల్ శక్తి మంత్రిత్వ శాఖలో తెలంగాణకు చెందిన పలు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేంద్ర మంత్రిగా చొరవ చూపి వాటిని త్వరగా పరిష్కరించాలని కోరామని వివరించారు. పాలమూరు,రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు 90 టీఎంసీల నీటి కేటాయింపు అడిగామని, వాటిలో 45 టీఎంసీల నీటిని వెంటనే కేటాయించాలని కోరామన్నారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో సహా సీడబ్ల్యూసీ ఛైర్మన్ కూడా ఉన్నారని వివరించారు. వారికీ కూడా ఇదే విషయాన్ని చెప్పామన్నారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను అందజేశామని తెలిపారు. వీలైనంత తొందరగా ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని క్లియరెన్స్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. 'ఆల్మట్టి డ్యాం 519 మీటర్ల కంటే ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టులో స్టే ఉంది. ఈ స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం కేబినెట్ తీర్మానం చేసి, జీవో ఇచ్చి ఎత్తు పెంచడానికి భూ సేకరణ కోసం ప్రొసీడింగ్స్ ఇచ్చింది. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం. ఇది చట్ట వ్యతిరేకం, కర్ణాటక ప్రభుత్వానికి చెప్పాలని విజ్ఞప్తి చేశాం. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచితే తెలంగాణ అన్యాయం జరుగుతుంది. అందుకే దీన్ని మేము వ్యతిరేకిస్తున్నాం అని చెప్పాం' అని మంత్రి వివరించారు. మంత్రితో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.శశాంక్ గోయెల్, నీటిపారుదల శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



సామాన్యులకే వైకుంఠ ద్వార దర్శనాలు

- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

ప్రతిపక్షం ప్రతినిధి, తిరుమల, నవంబర్ 18: తిరుమల తిరుపతి దేవస్థానంలో డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలలో సామాన్య భక్తులకే ప్రాధన్యతనిస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మంగళవారం ఉదయం తిరుమల అన్నమయ్య భవన్ లో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. వైకుంఠ ద్వార దర్శనాలలో పది రోజులకు గాను 182 గంటల దర్శన సమయంలో దాదాపు 164 గంటల దర్శనం సామాన్య భక్తులకే కేటాయిస్తామని చైర్మన్ చెప్పారు. మొదటి మూడు రోజులు శ్రీవాణి దర్శనాలను, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దు చేస్తామన్నారు. జనవరి 2వ తేది నుండి 8వ తేది వరకు ఆన్ లైన్ ద్వారా రోజువారీ 15వేల (రూ.300)ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, 1000 శ్రీవాణి టికెట్లను రెగ్యులర్ పద్ధతిలో కేటాయిస్తామన్నారు. ఈ పది రోజుల పాటు ఆర్జిత సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు ఉండవన్నారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా సిఫార్సు లేఖలు స్వీకరించబడవని చెప్పారు.



జిన్నింగ్ మిల్లర్లతో మంత్రి చర్చలు సఫలం

- అన్నిరకాలుగా సహకరిస్తామని 'తుమ్మల' హామీ
- నేటి నుంచి అంతటా పత్తి కొనుగోలు యథాతథం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : సచివాలయంలో మంగళవారం నాడు సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా, జిన్నింగ్ మిల్లర్ల అసోషియేషన్‌తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. మిల్లర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రైతుల సమస్యలు రెట్టింపయ్యేలా మిల్లుల యాజమాన్యాలు సమ్మెకు దిగడం సమంజసం కాదని అన్నారు. సమ్మెలాంటి విధానంతో కాకుండా, సామరస్యంగా కేంద్రంతో పోరాడుదామని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలియజేశారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యల గురించి కూడా ఒక నివేదిక తయారుచేసి కేంద్ర జౌళిశాఖ అధికారులకు పంపాల్సిందిగా వ్యవసాయ శాఖ సెక్రటరీని మంత్రి ఆదేశించారు. బుధవారం నుండి పత్తి కొనుగోళ్లు అంతటా యధాతథంగా ప్రారంభించాలని కోరారు. జిల్లాలలో నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లులను ప్రారంభించాలని అన్నారు. కౌలు రైతులకు ఇబ్బందులు కలగకుండా ఆధార్ అథెంటికేషన్, మొబైల్ ఓటీపీతో కొనుగోళ్లు జరపాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు.



ఏసీబీ వలలో టేక్మాల్ ఎస్సై రాజేశ్

- దాడులు గమనించి పరుగులు తీసిన ఎస్సై
- వెంటాడి మరీ పట్టుకున్న అధికారులు



ప్రతిపక్షంప్రతినిధి, మెదక్ నవంబర్ 18: ఏసీబీ ట్రాప్‌ను గమనించిన ఓ ఎస్ఐ పోలీసు స్టేషన్ వెనుక వైపు గోడ దూకి, పొలాల మీదుగా పరుగులు తీశారు. అక్కడే మాటు వేసిన 15 మంది ఏసీబీ సిబ్బంది ఎస్ఐని వెంబడించి పట్టుకున్నారు. మంగళవారం నాడు సినీ ఫక్కీలో జరిగిన ఈ సంఘటన మెదక్ జిల్లా టెక్మాల్ పోలీస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. మండలంలోని మహమ్మద్ పల్లికి చెందిన రైతు అద్దెకు తీసుకొచ్చిన హార్వెస్టర్ బ్యాటరీ చోరీ అయ్యిందని ఫిర్యాదు చేశాడు. ఈ కేసును పరిష్కరించడానికి ఎస్ఐ రాజేశ్ రూ.50 వేలు డిమాండ్ చేసినట్లు తెలుస్తుంది. మొదటి దఫాగా రూ.30 వేలు ఇచ్చాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం బాధితుడు రూ. 20 వేలు ఎస్ఐకు ఇచ్చి వెళ్తుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏసీబీ అధికారులు ఎస్ఐని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని విచారణ జరుపుతుండగా స్థానికులు టపాసులు పేల్చడం గమనార్హం.

2015-2016లో గ్రూప్-2 పరీక్ష రద్దు

- నిబంధనలు ఉల్లంఘించారన్న హైకోర్టు
- పునర్ మూల్యాంకనం చేయాలని ఆదేశం
- ఆ తరువాతే అర్హుల జాబితా రూపొందించాలి
- టీఎస్పీఎస్సీకి స్పష్టం చేసిన ధర్మాసనం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : పదేండ్ల కింద 2015-2016లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షను హైకోర్టు రద్దు చేసింది. కోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని, పరిధి దాటి వ్యవహరించిందని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిని పునర్ మూల్యాంకనం చేసి అర్హుల జాబితా నిర్ణయించాలని, ఈ ప్రక్రియ ఎనిమిది వారాలలో ముగించాలని ఆదేశించింది. వైట్నర్, దిద్దుబాటు ఉన్న జవాబుపత్రాల మూల్యాంకనంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్యాంపరింగ్ జరిగినట్లు తెలిసినా మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమన్న హైకోర్టు సాంకేతిక కమిటీ సూచన ప్రకారం పునర్ మూల్యాంకనం తప్పదని స్పష్టం చేసింది. చేయాలని 2015లో గ్రూప్2 నోటిఫికేషన్ జారీ చేసిన టీజీపీఎస్సీ 2016 నవంబర్‌లో రాత పరీక్షలు నిర్వహించింది. 2019లో గ్రూప్-2 నియామకాలు చేపట్టింది. తర్వాత హైకోర్టులో పలువురు పిటిషన్ దాఖలు చేశారు. వీటి మీద విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక పై తీర్పును మంగళవారం వెలువరించారు.



అట్ల స్వప్న కీలక పరిశోధన

- అభినందించిన డా. భూపతి రజని
- పరిశోధన పత్రం పుస్తక రూపంలో ప్రచురణ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 18: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భూపతి రజనీ దేవి, రిసెర్చ్ స్కాలర్ అట్ల స్వప్నను అభినందించారు. జనవరి 9 నుండి 11 తేదీలలో ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, గాంధీ గ్రామ్ రూరల్ ఇన్స్టిట్యూట్ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ), దిండిగల్ సంయుక్తంగా నిర్వహించిన 65వ ఆల్ ఇండియా అడల్ట్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్‌లో ఇన్ స్టిల్లింగ్ వాల్యూస్ త్రూ లైఫ్ లాంగ్ లర్నింగ్:ఏ పాత్ టూ హోలిస్టిక్ డెవలప్మెంట్ అనే అంశంపై అట్ల స్వప్న సమర్పించిన పరిశోధనా పత్రం ప్రచురితమైంది. ఈ సందర్భంగా ప్రచురించిన పుస్తకాన్ని డాక్టర్ భూపతి రజనీ దేవి చేతుల మీదుగా అట్ల స్వప్న అందుకున్నారు. డాక్టర్ భూపతి రజనీదేవి మార్గదర్శకత్వంలో స్వప్న చేసిన పరిశోధనకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోపు శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కబీర్ సతీష్‌కుమార్ తదితరులు అభినందించారు.

'అభయ హస్తానికి' దరఖాస్తు చేసుకోండి

- సివిల్స్ అభ్యర్థులకు 'లక్ష' ప్రోత్సాహకం
- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ప్రకటన



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులు అభయ హస్తం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి సీఎండీ బలరామ్ మంగళవారం తెలిపారు. గతంలో మెయిన్స్ కు ఎంపికై ఇప్పటికే లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందుకున్న వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ఇతర అభ్యర్థులు ఎవరైనా ఇంటర్వ్యూలకు ఎంపికైతే వారికి కూడా ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను, వివరాలను ఈ నెల 21వ తేదీ లోపు హైదరాబాద్ సింగరేణి భవన్ లో అందజేయాలని కోరారు. త్వరలో అర్హులందరికీ రెండో విడత లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. నిరుడు ప్రారంభించిన ఈ పథకం ద్వారా మెయిన్స్‌కు ఎంపికైన 140 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయగా, 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని సీఎండీ బలరామ్ తెలిపారు. 20 మందికి మరో విడత రూ.లక్ష చొప్పున సాయం అందించగా, వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో టాపర్గా నిలిచిన 11వ ర్యాంకర్ కూడా ఇందులో ఉన్నారని వివరించారు. ఈ యేడాది ప్రిలిమ్స్ పాసైన 202 మందికి ఆర్థిక చేయూత అందించగా, 43 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని వెల్లడించారు.



పుట్టపర్తిలో జరిగే శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి ఎదురుచూస్తున్నా. సమాజ సేవ, ఆధ్యాత్మిక మేల్కొలుపు కోసం సత్యసాయి జీవితం, చేసిన ప్రయత్నాలు తరతరాలకు మార్గదర్శకంగా ఉంటాయి. సత్యసాయి బాబాతో సంభాషించడానికి ఆయన నుంచి నేర్చుకోవడానికి కొన్ని అవకాశాలు తనకు లభించాయి.

- ట్విటర్‌లో ప్రధాని మోడీ

ఓపెన్ వాయిస్

నిజం చెప్పి ముందుకు సాగడమే!

బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్తామని గతంలో చాలెంజ్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అవి సాధ్యం కాకపోవడంతో, ఎలా ముందుకెళ్లాలా! అని కిందా మీదా పడుతోంది. సాధ్యం కావడం లేదని ప్రజలకు చెప్పడానికి మొహమాట పడుతోంది. అలాగే మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేసిన కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హామీని 'కామారెడ్డి డిక్లరేషన్'గా ప్రకటించి, బీసీల ఓటు బ్యాంకును సృష్టించుకుంది. కానీ, తాజాగా హైకోర్టు స్టే, సుప్రీంకోర్టు తిరస్కారాలు, ఆర్థిక, చట్టపర సమస్యల మధ్య 'ఇది అసలు సాధ్యమే కాదని' క్లారిటీ వస్తోంది. తెలంగాణలో బీసీల జనాభా 56 శాతం ఉదని కులగణనలో తేల్చారు. కానీ, ఉద్యోగ, విద్య అవకాశాలలో రిజర్వేషన్లు 29 శాతమే ఉన్నాయి. రాజకీయంగా అయితే, స్థానిక ఎన్నికలలో 25 శాతం రిజర్వేషన్ మాత్రమే ఉంది. కాంగ్రెస్ 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్'లో 42 శాతం రిజర్వేషన్లు, కులగణన సర్వే చేస్తామని ప్రకటించారు. కులగణన చేశారు. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. అందులో బీసీలు 56.33 శాతం రిపోర్ట్ వచ్చింది. ఈ డేటా ఆధారంగా అసెంబ్లీలో రెండు బిల్లులు పాస్ చేశారు. విద్య, ఉద్యోగ, రాజకీయాలలో 42 శాతం బీసీ కోటా కల్పించారు. కానీ, దీంతో సుప్రీంకోర్టు పెట్టిన 50 శాతం పరిమితి దాటిపోతుంది. బిల్లులు ఆమోదించాలని ఆగస్టులో రేవంత్ ఢిల్లీలో ధర్నా కూడా చేశారు. చివరికి జీఓ ఇచ్చారు. జీఓపై హైకోర్టు స్టే ఇచ్చింది. రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ ఫైల్ చేసింది. దానిని కూడా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇందుకు నిరసనగా న్యూఢిల్లీలో ధర్నా చేసినప్పుడు, రాహుల్‌ను ప్రధానిని చేసుకుని బిల్లును ఆమోదించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అంటే ఆయనకు లీగల్ గా రిజర్వేషన్లు రావని క్లారిటీ ఉన్నట్లే. కేంద్రం ఆమోదిస్తే ఓకే. అందుకే, బిల్లులు ఆమోదించడం లేదని కేంద్రాన్ని రేవంత్ విమర్శిస్తున్నారు. 42 కోటా సైంటిఫిక్ అని, బీసీల హక్కు అని. బిజేపీ కేంద్రం బిల్లులు పెండింగ్‌లో పెట్టి బీసీలను మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. కానీ, ఊరట మాత్రం లభించలేదు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ ఫైల్ చేసింది, కానీ ధర్మాసనం మాత్రం 'హైకోర్టు స్టే సరైనదే' అని తిరస్కరించింది. 1992 ఇంద్రా సాహ్ని డిజ్‌మెంట్ ప్రకారం 50 శాతం రిజర్వేషన్ పరిమితి పెట్టింది. కానీ, తమిళనాడు 69 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. వాటిని రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టారు. అప్పటి కేంద్రం పరిస్థితులు, తమిళనాడు రాజకీయాల కారణంగా అది సాధ్యం అయ్యింది. కానీ, తెలంగాణకు అది సాధ్యం కాదు. రాజ్యాంగ సవరణ అవసరం. అది ఇప్పుడు సాధ్యం కాదు. అప్పటి రాజకీయ పరిస్థితులు ఇప్పుడు లేవు. కాంగ్రెస్‌కు లాభం కలిగించే ఒక్క పని కూడా చేయడానికి బీజేపీగానీ, కేంద్రం కానీ ముందుకు రాదు. కాబట్టి ఇటు గవర్నర్ గానీ, రాష్ట్రపతిగానీ తెలంగాణ అసెంబ్లీ పంపించిన రెండు బిల్లులను ఆమోదించే ప్రసక్తే ఉండదు. మొండిగా ముందుకు పోవడం వల్ల కూడా ఎలాంటి ప్రయోజనం ఉండదని కూడా పలువురు రాజకీయ నిపుణులు చెబుతున్నారు. అందుకే సీఎం రేవంత్ బీసీ రిజర్వేషన్ల అంశంపై.. ప్రజలకు నిజాలు చెప్పి, పార్టీరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం కనిపిస్తోంది. లేకపోతే ప్రజలు ముఖ్యంగా బీసీలు తమను మోసం చేశారని అనుకునే ప్రమాదం ఉంది.

అభినవ వట్టికోట... ఈ అవిలేను

'అవిలేను' సుమారు 30 యేండ్లు శ్రమించి అత్యంత విలువైన పుస్తక భాండాగారాన్ని సమకూర్చాడు. నాలుగేళ్ల ముందు వరకు చిన్న గదిలో అద్దెకు ఉండే అవిలేను పుస్తకాలను పాఠకులకు, నిరుద్యోగులకు, పరిశోధకులకు అందించగలిగినప్పటికీ, పుస్తకాలను ఉంచే స్థలం లేక కొంతకాలం ఇబ్బంది పడ్డాడు. గ్రంథాలయం కోసమైనా తనకు ఓ సొంత ఇల్లు కావాలని, ఓ ఇల్లు కొని ఆ ఇంటినే గ్రంథాలయంగా మార్చేశాడు. పిల్లలమర్రి వీరభద్ర కళాపీఠం పేరుతో సంస్థను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా గ్రంథాలయం నిర్వహిస్తున్నాడు. వచ్చిపోయే పరిశోధకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. దూర ప్రాంతం నుంచి వచ్చే పరిశోధకుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశాడు. ఎవరైనా వచ్చి ఒక పుస్తకం చదివి వెళ్లారంటే తాను ఎంతో సంతృప్తిచెందుతాడు.



డా. సాగర్ల సత్తయ్య
7989117415

కొందరు సామాన్యంగా కనిపిస్తారు. వాళ్ల పనుల ద్వారా అసామాన్యులై నిలుస్తారు. వ్యక్తిగత జీవితం కంటే సమాజం కోసమే జీవితం అనే మనుషులు ఈ కాలంలో అరుదుగా ఉంటారు. అటువంటి అరుదైన ఉపాధ్యాయుడు శీల అవిలేను. పుట్టింది తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా ఓ మారుమూల ప్రాంతం అడ్డ గూడూరు మండలం చిర్రగూడూరు గ్రామం. ఉద్యోగ రీత్యా ప్రస్తుతం నివాసం ఉండేది సూర్యాపేట పట్టణం. అవిలేనుకు పుస్తకాలు అంటే ప్రాణం. చిన్నతనం నుండి పుస్తకాలు చదవడం ఇష్టంగా పెంచుకున్న అవిలేను తాను పదవ తరగతి పూర్తిచేసుకుని తిరుమలగిరి (ప్రస్తుత సూర్యాపేట జిల్లాలోని ఓ మండల కేంద్రం) లో ఇంటర్ చదవడానికి వచ్చినప్పుడు అక్కడి గ్రంథాలయం అతనికి పరిచయమైంది. గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం ద్వారా తన ప్రపంచం విశాలమైంది. అప్పటినుండే నుండే ఇలాంటి గ్రంథాలయం ఒకటి సొంతంగా తన జీవిత కాలంలో తప్పకుండా స్థాపించాలని బలంగా నిర్ణయించుకున్నాడు. పుస్తకాలే లోకంగా తనకు నచ్చిన పుస్తకాలను సేకరించడం మొదలుపెట్టాడు.

లక్షన్నర పుస్తకాలతో గ్రంథాలయం

ప్రస్తుతం సుమారు లక్షన్నర పుస్తకాలతో గ్రంథాలయం నడుపుతున్న అవిలేను మూడు దశాబ్దాలుగా పుస్తకాలు సేకరించిన విధానం చూస్తే అబ్బురం అనిపిస్తుంది. తన దగ్గర వ్యక్తిగత ఖర్చులకోసం ఉన్న డబ్బులను కూడా పుస్తకాలు కొనడానికే వెచ్చిస్తాడు. ఇట్లా కొన్ని వేల పుస్తకాలు కొన్నాడు. ఇతని అభిరుచి గమనించిన పలువురు పుస్తక ప్రియులు, రచయితలు ఈయన గ్రంథాలయం కోసం పంపే పుస్తకాలను స్వీకరిస్తాడు. ఇది అవిలేను పుస్తకాలు సేకరించడంలో రెండో పద్ధతి. ఇక మూడో పద్ధతి చూస్తే మనకు ఆశ్చర్యం కలుగక మానదు. సాధారణంగా మనం బజారులో వెళ్తున్నప్పుడు పాత ఇనుప సామాను షాపులు కనిపించినా వాటిపై మనకు అంత సూక్ష్మదృష్టి ఉండదు. కానీ, అవిలేను పాత ఇనుప సామాను షాప్ లలో ఉండే పాత పుస్తకాలను పరిశీలనగా చూసి, అనేక విలువైన ఒక తరానికి చెందిన గ్రంథాలు చెత్త పుస్తకాలుగా పోతుండడం గమనించాడు. ఎందుకు ఇలా జరుగుతుందని ఆలోచించినప్పుడు, ఒక సాహితీవేత్త లేదా మేధావి జీవితంలో తాను సంపాదించిన గ్రంథాలు తన అనంతరం వారసులకు ఆసక్తి లేకపోవడం వలన వాటిని చెత్త పుస్తకాల షాపులకు అమ్ముతున్నారు. ఇంత విలువైన సంపద ముందు తరాలకు అందకుండా అంతరించిపోతే ఎలా ? అని ఆలోచించాడు . ఎలాంటి బేషజం లేకుండా సూర్యాపేట పాత పుస్తకాల షాపులలో ముందు తరాలకు కావలసిన అన్ని రకాల పుస్తకాలను వాళ్లకు ఇవ్వవలసిన ధర కంటే ఎక్కువగా వెచ్చించి కొనడం మొదలు పెట్టాడు. తాను ఉపాధ్యాయుడు. ఆడంబరంగా ఉండాలి వంటి ఆలోచనలు అవిలేనుకు ఉండవు. అవసరమైతే పుస్తకాల మూట ఎత్తిన పెట్టుకొని వెళ్లిపోయేంత నిరాడంబరుడు అవిలేను. ముందు తరాలకు ఈ విజ్ఞానాన్ని అందించడానికి పుస్తకాలకు మించిన ప్రత్యామ్నాయం లేదంటాడు. వాటిని చదవాలి చదివించాలి ముందు తరాలకు అందించాలి అనే సందేశంతో ముందుకు సాగుతుంటాడు.




సుమారు 30 యేండ్లు శ్రమించి

అవిలేను సుమారు 30 యేండ్లు శ్రమించి అత్యంత విలువైన పుస్తక భాండాగారాన్ని సమకూర్చాడు. నాలుగేళ్ల ముందు వరకు చిన్న గదిలో అద్దెకు ఉండే అవిలేను పుస్తకాలను పాఠకులకు, నిరుద్యోగులకు, పరిశోధకులకు అందించగలిగినప్పటికీ, పుస్తకాలను ఉంచే స్థలం లేక కొంతకాలం ఇబ్బంది పడ్డాడు. గ్రంథాలయం కోసమైనా తనకు ఓ సొంత ఇల్లు కావాలని, ఓ ఇల్లు కొని ఆ ఇంటినే గ్రంథాలయంగా మార్చేశాడు. పిల్లలమర్రి వీరభద్ర కళాపీఠం పేరుతో సంస్థను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా గ్రంథాలయం నిర్వహిస్తున్నాడు. వచ్చిపోయే పరిశోధకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. దూర ప్రాంతం నుంచి వచ్చే పరిశోధకుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశాడు. ఎవరైనా వచ్చి ఒక పుస్తకం చదివి వెళ్లారంటే తాను ఎంతో సంతృప్తిచెందుతాడు. ఎందరో నిరుద్యోగులు అవిలేను గ్రంథాలయంలోని పుస్తకాలను పోటీ పరీక్షల కోసం వినియోగించుకొని నేడు ఉద్యోగాలలో స్థిరపడ్డారు. అనేకమంది పరిశోధకులు ఈ గ్రంథాలయం ఆధారంగా పరిశోధనలు చేశారు. ఇంకా చేస్తున్నారు.

అన్ని ప్రక్రియలకు సంబంధించిన సాహిత్యం

ఈ గ్రంథాలయంలో ఎన్సైక్లోపీడియా, బ్రిటానికా వంటి అత్యుత్తమ గ్రంథాలతో కూడిన ఆంగ్ల సాహిత్యం తెలుగులో అన్ని ప్రక్రియలకు సంబంధించిన అత్యుత్తమ సాహిత్యం, వైజ్ఞానిక సంబంధ సాహిత్యం, ఆధ్యాత్మిక సాహిత్యం, బాల సాహిత్యం అనేక పరిశోధనా గ్రంథాలు, చరిత్ర గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, వేలకొద్దీ కథల సంపుటాలు నవలలు ఇలా ఇది అది అని కాకుండా అన్ని రకాల సాహిత్యానికి చోటు కల్పించాడు. 100 సంవత్సరాలకు పూర్వం ప్రచురించబడ్డ అరుదైన యక్షగానాలు, నాటకాలు, పద్య కావ్యాలు అవిలేను గ్రంథాలయంలో కనిపిస్తాయి. విశేష సంస్కృత సాహిత్యం, హిందీ, కన్నడ, మరాఠా భాషల పుస్తకాలు సైతం అవిలేని గ్రంథాలయంలో ఉన్నాయి.



అనేక మంది రచయితల దగ్గర కూడా లేనివారి పుస్తకాలు అవిలేను గ్రంథాలయంలో దొరుకుతుండడం గమనించవచ్చు. నేటి తరం విద్యార్థులలో చదివే అభిరుచి తగ్గిపోతున్నదని భావించి విద్యార్థుల స్థాయికి తగిన పుస్తకాలను విద్యార్థుల చెంతకు చేర్చేందుకు 'చదవండి చదివించండి' అనే నినాదంతో ప్రతి పాఠశాలకు 100 పుస్తకాలు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఇప్పటికీ సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి జిల్లాలలో అనేక పాఠశాలలకు అందించారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు తనను సంప్రదించమని కోరుతున్నారు. పిల్లలమర్రి పిల వీరభద్ర కళాపీఠం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నారు. కవి సమ్మేళనాలు, పుస్తక పరిచయ కార్యక్రమాలు, అవధానాలు మొదలైన సాహిత్య కార్యక్రమాలకు చేయూతనిస్తున్నారు.

(గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా)

(వ్యాసకర్త కవి, రచయిత)

విద్వేష ప్రచారానికి ప్రలోభాలే కారణమా?!



ఎండీ ఉస్మాన్ ఖాన్
99125 80645

ఇటీవల సోషల్ మీడియాలో ఒక ఆందోళనకర ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. మత విద్వేషాన్ని రెచ్చగొట్టే అసత్య ప్రచారం, వాస్తవాలను వక్రీకరించే వ్యాఖ్యానాలు, వివిధ వర్గాల మధ్య అనుమానాలను పెంచే కథనాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఈ కోవలోనే తాజాగా ఈవరుసలో చేరిన వ్యక్తి 'నా అన్వేషణ' పేరుతో ప్రపంచ యాత్రికుడిగా చెప్పుకునే అన్వేష్. వివిధ దేశాల పర్యటనల్లో, ముఖ్యంగా అరబ్ దేశాలకు వెళ్లినప్పుడు, అక్కడ తనకు లభించిన ఆదరణ, ఆతిథ్యం గురించి, ముస్లింల నుంచి పొందిన గౌరవం గురించి అతనే పాత వీడియోల్లో ప్రశంసించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు పూర్తిగా భిన్న స్వరంతో మాట్లాడుతున్నాడు. ఈ మార్పుకు కారణాలు ఏమిటి! అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అతని వ్యవహారశైలి, ముస్లిం సమాజంపై అతడు చేస్తున్న ఆరోపణలు, కనీస అవగాహన లేకుండా, వాస్తవాలను వక్రీకరించి, మత విద్వేషం పెంచేవిధంగా ఉన్నాయి. ఆధారంలేని ఆరోపణలతో మతాల మధ్య విభేదాలను రెచ్చగొట్టే వీడియోలను వరుసగా విడుదల చేస్తున్నాడు. అన్వేష్ ఇటీవల ఇస్లాం, ముస్లింల గురించి చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే అవి ఎంత అసత్యం, ఎంత దుర్మార్గంతో చేసినవో ఇట్టే తెలిసిపోతుంది.

మనస్సాక్షికి, నైతిక విలువలకు విరుద్ధం

'ఖురాన్ చదివినవారు ఉగ్రవాది అవుతారని' చేసిన వ్యాఖ్య పూర్తి అవాస్తవమే కాకుండా మనస్సాక్షికి, నైతిక విలువలకు విరుద్ధం. ప్రపంచంలో ఒక బిలియన్ పైగా ముస్లింలు రోజూ ఖురాన్ చదువుతారు; వారిలో శాస్త్రవేత్తలు, వైద్యులు, కవులు, ఉపాధ్యాయులు, సామాజిక సేవకులు అందరూ ఉన్నారు. ఖురాన్ బోధనలు సంపూర్ణంగా మానవీయ విలువల దర్పణం. ఈ పుస్తకం చదివిన అనేక మంది అన్వేషకులు, విద్యావేత్తలు ప్రపంచానికి సేవలు చేస్తున్నారు. వారంతా ఉగ్రవాదులన్నట్టుగా మాట్లాడటం పచ్చి అబద్ధం. అంతేకాదు, మొత్తం మానవ సమాజాన్నీ అవమానించడమే. విచిత్రమేమిటంటే, యూట్యూబర్‌గా అనేక ముస్లిం దేశాలు కూడా తిరిగిన అన్వేష్ ఆయా దేశాలలో పొందిన గౌరవ మర్యాదలు, అక్కడి ప్రజలు తనపై చూపిన ఆదరణను స్వయంగా అనుభవించిన అన్వేష్ , ఇస్లాం గురించి ఎలాంటి అపార్థాలు వద్దని, ముస్లింలు చాలా మంచివారని బలంగా చెప్పాడు. కానీ, ఇప్పుడు ఏమైందో ఏమోగాని, ఒక్కసారిగా యూటర్న్ తీసుకొని పచ్చి అబద్ధాలకు తెగబడుతున్నాడు. నిజంగా ఖురాన్ హిందువులను చంపమని చెప్పి ఉంటే, కోట్లాదిమంది హిందూయేతరులు ఇంత హాయిగా ముస్లిం



దేశాలలో మనగలిగేవారా? అసలీ అన్వేష్ ప్రాణాలతో మిగిలేవాడా? భారతదేశంలో కూర్చొని ఇంత నిక్షేపంగా ముస్లిం వ్యతిరేక వీడియోలు చేయగలిగేవాడా? అతను ఇంకా బతికి ఉన్నాడంటే ఇస్లాం, ముస్లింలతో ఎలాంటి ఇబ్బందీ లేదనే కదా! అర్థం.

అధిక సంఖ్యలో పిల్లలు కంటారని

ఈ యూట్యూబర్ ఇంతటితో ఆగలేదు. ముస్లింలు అధిక సంఖ్యలో పిల్లలు కంటారని కొన్ని జంతువుల పేర్లు ఉటంకిస్తూ నీచంగా మాట్లాడాడు. అదీ అతడి సంస్కారం. అధిక సంతానం కలిగినవారు ముస్లిమేతరులలో లేరా? ఏదైనా ఒక్కఊరు శాంపిల్ గా తీసుకొని సర్వే చేస్తే నిజం వెల్లడవుతుంది కదా? ఆపని ఎందుకు చేయడు? అంతెందుకూ ఇటీవల రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌కు చెందిన రేఖ గల్బెలియా (55) అనే హిందూ మహిళ, ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా 17 మంది పిల్లలకు జన్మనిచ్చిన విషయం ఈ మూర్ఖ శిఖామణికి తెలియదా? అంతేకాదు, జనాభా లెక్కలు తీసినాకూడా ఆతని వాదన పూర్తిగా తప్పని తేలిపోతుంది. భారత జనగణన, ఎన్ఎఫ్‌హెచ్ఎస్ వంటి జాతీయ సర్వే ప్రకారం, జనాభా పెరుగుదలకు మతంతో సంబంధం లేదు; ఆర్థిక స్థితి, విద్య, ఆరోగ్య అవగాహనతో సంబంధం ఉంటుంది. ముస్లిం జననాల రేటు మూడు దశాబ్దాలలో 45 శాతం తగ్గింది. హిందువులది కూడా తగ్గింది. ఇరు వర్గాల మధ్య తేడా ఇప్పుడు చాలా తక్కువ. నగరాలలో అయితే పరిస్థితి దాదాపు సమానం. 'ముస్లింలే ఎక్కువ మంది పిల్లలు కంటారు' అనడం నూటికి వెయ్యిశాతం వక్రీకరణ తప్ప వాస్తవం కాదు. ఇంకో పెద్ద అబద్ధం ఏమిటంటే, ముస్లింలు పన్నులు కట్టరన్న వ్యాఖ్య. భారతదేశంలో పన్నులు మతం ఆధారంగా వసూలు చేయరు. ఆదాయం ఉన్నవారంతా పన్నులు కడతారు. జీఎస్టీ ద్వారా రోజువారీగా ప్రతి వ్యక్తి పరోక్షంగా పన్నులు చెల్లిస్తాడు. ముస్లిం వ్యాపారులు, ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ ఎంతో మంది ఐటీ రిటర్న్‌లు వేస్తున్నారు. ఈ వాస్తవాలను పక్కన పెట్టి, ఒక సమాజంపై అసత్య ఆరోపణ చేయడం ప్రమాదకర విద్వేషరాజకీయం తప్ప మరేమీకాదు.

తాలిబాన్ యోధులతో కూర్చుని

మరో విచిత్రం ఏమిటంటే, అఫ్ఘానిస్తాన్‌లో తాలిబాన్ యోధులతో కూర్చుని, వారి వేషధారణను అనుకరిస్తూ, తుపాకులు పట్టుకొని, తలపాగా చుట్టుకొని ఫొటోలు దిగిన ఇదే అన్వేష్, అప్పట్లో తాలిబన్లను ప్రశంసలలో ముంచెత్తాడు. వారెంతో మర్యాదస్తులని, తనకు ఎంతో గొప్ప ఆతిథ్యం ఇచ్చారని పొగిడాడు. అదే వ్యక్తి ఇప్పుడు ఇస్లాంను ఉగ్రవాద మతమని చిత్రీకరిస్తున్నాడు. దీన్నిబట్టి అతగాడి రెండు నాల్కల ధోరణి, అతడి క్రూర మనస్తత్వం ఇట్టే తెలిసిపోతుంది. అతని మాటల విశ్వసనీయత పూర్తిగా కుప్పకూలింది.

అకస్మాత్తుగా అతడిలో ఈ మార్పుకు కారణం ఏమైఉంటుంది? ఏ ప్రలోభాలకు లొంగి అతను ఈ విధంగా ఒక కమ్యూనిటీకి వ్యతిరేకంగా, ఇంత నీచానికి దిగజారి ఉంటాడు అనేది అర్థం కావడంలేదు. అన్వేష్ మాట్లాడే ప్రతి మాట ముస్లింలపై మాత్రమే కాదు, భారతీయ సమాజం మూల విలువలపై దాడి. ఒక సమాజం మొత్తం మీద అభాండాలు వేయడం, తరతరాలుగా అన్నదమ్ముల్లా కలసీ మెలసీ జీవిస్తున్న ప్రజలమధ్య అనుమానాలను రేకెత్తించడం, కేవలం తప్పుదారి పట్టించడమే కాదు, అది దేశ భవిష్యత్తును విషపూరితం చేసే దుర్మార్గమైన చర్య. అతడు వ్యాప్తి చేస్తున్న అబద్ధాలను వాస్తవాలతో ప్రజల ముందుకు తేవడం ప్రతి పౌరుడి బాధ్యత.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

సవాలు విసిరిన నవజాత శిశువు



యేచన్ చంద్ర శేఖర్
8885050822

'తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు' అయ్యింది బ్రెజిల్‌కు చెందిన క్విడీ అరౌజో డి ఒలివీరా అనే మహిళ పరిస్థితి. ఈమె ఇప్పుడే సంతానం వద్దు అనుకుని దాదాపు రెండు సంవత్సరాలుగా 'ఇంట్రా యూరెటైన్ డివైజ్' (ఐయూడీ) లేదా 'కాపర్ కాయిల్' అని పిలిచే గర్భనిరోధక సాధనాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, ఆమె ప్రయత్నాలు విఫలమై పండంటి మగశిశువును ప్రసవించింది. డెలివరీ రూమ్‌లో గర్భనిరోధక కాయిల్‌ను చేతిలో పట్టుకున్న ఆ బుడతడి ఫొటో వైరల్ అయింది. బ్రెజిల్ దేశం గోయియాస్, నెరో పోలిస్‌లోని సాగ్రాడో కొరాకో డి జీసస్ ఆసుపత్రిలో క్విడీ అరౌజో డి ఒలివేరాకు ఆ బిడ్డ జన్మించింది. మిర్రర్ ఉదహరించిన నివేదికల ప్రకారం, నవజాత శిశువు రాగి టీని పిడికిలితో పట్టుకుని రావడాన్ని చూసి వైద్యులు ఆశ్చర్యపోయారు. సాధారణంగా ఐయుడి గర్భనిరోధక సాధనాలు తొంభై తొమ్మిది శాతానికి పైగా విజయవంతంగా గర్భాన్ని నిరోధిస్తాయని ప్రఖ్యాతి గాంచడం విశేషం. ఇలాంటి అరుదైన సంఘటనలు పది లక్షల మందిలో ఒకరికి జరిగే అవకాశం ఉంటుందని వైద్యుల అభిప్రాయం.

ఐయూడీ అంటే ఏమిటి?

గర్భాశయ పరికరం లేదా ఐయుడి అనేది గర్భధారణను నివారించడానికి గర్భాశయం లోపల ఉంచబడే ఇంగ్లీషు అక్షరం 'T' ఆకారంలో ఉండే చిన్న జనన నియంత్రణ పరికరం. వీటిలో రాగి ఐయూడీ, హార్మోన్ల ఐయూడీ అని రెండు రకాలు ఉంటాయి. మాయో క్లినిక్ ప్రకారం, రాగి ఐయూడీలు రాగి అయాన్‌లను విడుదల చేయడం ద్వారా పని చేస్తాయి. ఇది వీర్య కణాలు అండాన్ని చేరుకోవడాన్ని నిరోధించి ఫలదీకరణ ప్రక్రియ కష్టతరమయ్యే పరిస్థితులను కల్పిస్తుంది. హార్మోన్ల ఐయూడీలు ప్రొజెస్టిన్‌ను విడుదల చేస్తాయి. ఇది గర్భాశయ శ్లేష్మాన్ని చిక్కగా చేసి, వీర్యకణాలను నిరోధించడానికి గర్భాశయ పొరను పలుచబరుస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం, ఐయూడీ అనేది అందుబాటులో ఉన్న అత్యంత ప్రభావవంతమైన గర్భనిరోధక పద్ధతుల్లో ఒకటి. దీని కాల పరిమితి రకాన్ని బట్టి 5 నుండి 10 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఈ గర్భనిరోధక పద్ధతిని ఆశ్రయించిన మహిళ, గర్భం ధరించాలని నిర్ణయించుకున్నప్పుడు ఎప్పుడైనా సరే దీనిని సులభంగా తొలగించుకోవచ్చు.

క్విడీ గర్భిణి అని ఎలా తెలిసింది?

ఒక సాధారణ పరీక్షల సమయంలో క్విడీ గర్భవతి అని తేలింది. ఆ పరిస్థితులలో కాయిల్‌ను తొలగించడం వల్ల గర్భధారణ ప్రమాదంలో పడుతుందని, అబార్షన్‌కు దారి తీయవచ్చని వైద్యులు సూచించడంతో ఆమె దానిని, అలాగే తన గర్భాశయం లోపల ఉంచుకునేందుకు నిర్ణయించుకుంది. దీని కారణంగా ఆమెకు రక్తస్రావం, పరికరం పాక్షికంగా వేరుపడటం వంటి సమస్యలు ఎదురయ్యాయి. కానీ, చివరికి, గర్భనిరోధక కాయిల్ సహా మగ



శిశువు మాథ్యూస్ ప్రసవం సురక్షితంగా జరిగిపోయింది. ప్రసవం తరువాత, కాన్పు జరిపిన డాక్టర్ నటాలియా రోడ్రిగ్స్ గర్భనిరోధక ఐయూడీని గమనించి, దానిని నవజాత శిశువు మాథ్యూస్ చేతిలో ఉంచారు. ప్రసూతి గదిలో డాక్టర్ తీసిన ఫొటోలో మాథ్యూస్ గర్భనిరోధక సాధనాన్ని తన చిట్టి చేతులలో ఒక ట్రోఫీలా పట్టుకున్నట్లు కనిపిస్తుంది. 'నా ఉనికిని అడ్డుకోజాలని ఐయూడీ: నా విజయ ట్రోఫీతో నేను!' అన్న శీర్షికతో డాక్టర్ రోడ్రిగ్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ చిత్రాన్ని షేర్ చేశారు. ఏమైతేనేం, తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా, సురక్షితంగా ఉన్నారని నివేదించడంతో శుభం కార్డు పడింది.

(వ్యాస రచయత భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం

మావోయిస్టులకు చివరి హెచ్చరిక



- మార్చి నాటికి మావోయిజం అంతం
- తుపాకీ పట్టుకుంటే క్షమించే ప్రసక్తే లేదు
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 18: అర్బన్ నక్సల్స్ చెప్పే మాయమాటలు నమ్మి అడవులలో ప్రాణాలు కోల్పోవద్దని మావోయిస్టులకు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 మార్చి నాటికి మావోయిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. నాలుగు నెలలు మాత్రమే సమయం ఉందని, తుపాకీ వీడి జన జీవన స్రవంతిలో కలవాలని, బ్యాలెట్‌ను నమ్మితే మోడీలా దేశాన్ని నడిపే అవకాశం ఉంటుందని, బుల్లెట్ నమ్మితే ప్రాణాలే పోతాయని అన్నారు. హిడ్మా ఎన్ కౌంటర్ మీద బండి సంజయ్ మాట్లాడుతూ 'తుపాకీతో రాజ్యాధికారం సాధ్యం కాదు. తుపాకీ పట్టుకుని పోలీసులు, దళితులు, గిరిజనులను చంపారు. దేశం జెండా ఎగరేయొద్దని ఎందరో బీజేపీ నేతలను చంపారు. ఈ దేశంలో తుపాకీ ఉండాల్సింది జవాన్ల చేతులలో, పోలీసుల చేతులలో మాత్రమే' అని వ్యాఖ్యానించారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 18 : ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎమ్మెల్యే గా గెలిచిన నవీన్ యాదవ్ మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను సత్కరించి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర పత్తి రైతులను రక్షించండి

- కేంద్ర మంత్రి గిరిరాజ్ కు ఎంపీ వంశీ లేఖ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 18 : తెలంగాణ పత్తి రైతుల సమస్యలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. సీసీఐ రాష్ట్ర సగటు పత్తి దిగుబడిని 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించడం తప్పుడు నిర్ణయమని పేర్కొన్నారు. ఈ అంచనా రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ సమర్పించిన డేటాకి విరుద్ధమని స్పష్టం చేశారు.ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 6,680 ఎంఎంటీ పత్తి కొనుగోలు కాగా, 3,175 మంది రైతులు లబ్ధి పొందారు. పత్తి కొనుగోలు విలువ రూ.52.25 కోట్లు, అందులో రూ.15.04 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాలలో జమయ్యాయి. ఇప్పటికే మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతుల పరిస్థితి మరింత దెబ్బతింటుందని, దిగుబడి అంచనాలను తగ్గించే నిర్ణయాన్ని పునర్విమర్శించాలని ఎంపీ కోరారు.పత్తి మిల్లర్లు, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సూచించిన మాయిశ్చర్ నార్మ్స్, ఎల్ 1, ఎల్2 విభజన సమస్య, స్లాట్ బుకింగ్ కష్టాలు, జిన్నింగ్ మిల్లుల కార్యకలాపాల సమస్యలు వంటి అంశాలను కూడా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సానుకూల చర్యలను ప్రశంసించారు. టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 176 మార్కెట్ యార్డుల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు, సీసీఐతో కలిసి జిన్నింగ్ మిల్లుల మ్యాపింగ్, అవగాహన కార్యక్రమాలు రైతులకు మేలు చేస్తాయని తెలిపారు. 'రాష్ట్ర సగటు పత్తి దిగుబడి 11.74 క్వింటాళ్లుగా కొనసాగించాలి. మాయిశ్చర్ పరిమితిని 20 శాతం వరకు సడలించాలి. మిల్లర్లు, ట్రేడర్స్ అసోసియేషన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి' అని ఎంపీ డిమాండ్ చేశారు.



జానపదాలు శ్రామికులకు ఆటవిడుపు

- రచయిత కెప్టెన్ మధుసూదన్ రెడ్డి
- కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా వారోత్సవాలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 18: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం నాడు జానపద గీతాలాపనలతో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ ప్రాంగణం దద్దరిల్లింది. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సరిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపల్, ప్రముఖ రచయిత కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పల్లె జనుల నాలుకలపై నడయాడే జానపద గీతాలు శ్రామికులకు ఆటవిడుపుగా సంతోషాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గేయ రచయితలు, గాయకులు ఓరుగంటి శేఖర్, బుర్ర సతీష్, గంగారపు మల్లేశం పాటలు పాడి అలరించారు. సీనియర్ లైబ్రేరియన్ అర్జున్, సహాయ లైబ్రేరియన్ సరిత, గాయకుడు శ్రీనివాస్, గ్రంథాలయ సిబ్బంది, 150 మంది యువతీయువకులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలను నిర్వహించారు. బహుమతి ప్రదానం ఈ నెల 20న ఉదయం ముగింపు సమావేశంలో జరుగుతుందని కార్యదర్శి సరిత చెప్పారు.

డివిజన్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తా

- పిఏసి చేర్మెన్ ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ



ప్రతిపక్షం, శేరిలింగంపల్లి, నవంబర్ 18 : కొండాపూర్ డివిజన్ పరిధిలోని గోల్డెన్ తులిప్ కాలనీలో రూ. 35 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసి, జాగృతి కాలనీలో రూ.2 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ (విభాగీ వీధి దీపాలను) కార్పొరేటర్లు హమీద్ పటేల్ , నార్నె శ్రీనివాసరావు తో కలిసి పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలుదొడ్డి లో హ్యుందాయ్ సర్విస్ సెంటర్ నుండి జయభేరి సహస్రా వరకు రూ. 40 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఆర్సీసీ బాక్స్ డ్రైన్ (వరద నీటి కాల్వ) నిర్మాణం పనులకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తో కలిసి పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.



అయ్యప్పస్వాములకు 'బిక్ష' షురూ!

- శివమారుతి గీతా మందిరంలో ప్రారంభం

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 18 : పట్టణంలోని శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ (బిక్ష) మంగళవారం నుంచి ప్రారంభమైంది. గురుస్వామి గిరీశ్ సతీయన్ నాయర్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప స్వాములు బాతుక లక్ష్మయ్య గౌడ్ స్వామి, శేఖర్ స్వామి, నిరంజన్ స్వామి పాల్గొన్నారు.. తొలి రోజు వీరన్నపేట కు చెందిన గిరిమోని జ్యోతిసుదర్శన్ దంపతులు అన్నవితరణ నిర్వహించారు. గత కొన్నేళ్లుగా అయ్యప్పదీక్ష తీసుకున్న స్వాములకు మధ్యాహ్నం 'బిక్ష' నిర్వహిస్తున్నారు. నిత్యం వందలాది మంది స్వాములు బిక్ష తీసుకొని వెళ్తుండడం విశేషం. దేవాలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, కార్యదర్శి రేటికల్ నందీశ్వర్ స్వామి, కోశాధికారి దాస కృష్ణయ్య, టాప్సన్ వెంకటేష్ మల్చలం మురళి, శ్రీనాథ్ స్వామి, రాజేష్, శివ, యుగంధర్,శివమారుతీ గుడి సన్నిధానం స్వాములు పాల్గొన్నారు.



రోడ్డుపనుల్లో వేగం పెంచాలి

- ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి ఐఏఎస్ శ్రీనివాస్ రాజు
- హైవే పనులను పరిశీలించిన ఉన్నత అధికారులు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 18 : అప్ప జంక్షన్ నుండి మన్నెగూడ వరకు నేషనల్ హైవే పనులను త్వరతగతిన వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజు సూచించారు. మంగళవారం మండల పరిధిలో జరుగుతున్న హైవే రోడ్డు పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మొయినాబాద్ చేవెళ్ల బైపాస్ రోడ్డు పనుల సైతం పరిశీలించిన అధికారులు రోడ్డు విస్తరణ పనుల యుద్ధ ప్రాతిపదికలను చేపట్టాలని తెలిపారు . మెగా కంపెనీ ప్రతినిధులకు ఆదేశించారు. ప్రమాదానికి కారణమవుతున్న మలుపుల వద్ద రోడ్డు విస్తరణ పనులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషన హైవే ప్రాంతీయ అధికారి ఆర్ఓ శివశంకర్ , మాజీ ఐఏఎస్ అధికారి సుందర్ అబ్నర్, ఆర్డీవో చంద్రకళ , తహసిల్దారులు గౌతమ్ కుమార్ ,కృష్ణయ్య , మిషన్ భగీరథ ఎస్ . ఈ చలమారెడ్డి, మెగా కంపెనీ ప్రతినిధి సురేష్, ప్రాజెక్ట్ డైరెక్టర్ మండల్ సర్వే జలజ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

- కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్


ప్రతిపక్షం, ఉప్పల్ ,నవంబర్ 18 : ఉప్పల్ నియోజకవర్గంలోని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ వారి కార్యాలయంలో కలిసి సర్వే ఆఫ్ ఇండియా సిగ్నల్స్ వద్ద ఫుటోవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిందిగా, అదేవిధంగా మల్టీ యుటిలిటీ ఫంక్షన్ హాల్ కొరకు డివిజన్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ దశలవారీగా స్ట్రామ్ వాటర్ డ్రైన్, సిసి రోడ్లకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

- ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



ప్రతిపక్షం, ఎల్‌బి నగర్, నవంబర్ 18 : ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్య కాలనీ లో జరుగుతున్న డ్రెయిన్ పనులను స్థానిక నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యేకు వివరించిన సందర్భంలో, ఆగమయ్య కాలనీ లోని కేఎల్ఎమ్ షాపింగ్ మాల్ వెనుక నుంచి చేపట్టే ట్రంక్ లైన్ పనులు మెయిన్ లైన్‌కు లెవల్స్ సరిపోకపోవడంతో కొన్ని సాంకేతిక సమస్యలు నెలకొన్నట్లు తెలిపారు. ప్రతిగా పక్క వీధి నుంచి ట్రంక్ లైన్ నిర్మాణాన్ని చేపట్టే విధంగా ప్రత్యామ్నాయ ప్రణాళికను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పనులను వేగవంతంగా మరియు నాణ్యంగా పూర్తి చేయాలని అధికారులు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా ట్రంక్ లైన్ పనులను ముగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కనకయ్య, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, బాలరాజు గౌడ్, రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గురుకుల్‌ను ప్రశంసించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

- విద్యార్థులను బాధ్యతయుత పౌరులుగా తీర్చిదిద్దడం ఆదర్శం

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 18 : విద్యార్థులను బాధ్యత ఇతంగా ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తున్న స్వామినారాయణ్ గురుకుల్ సంస్థ ఎంతో ఆదర్శంగా ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ హైదరాబాద్ ఆర్గనైజర్ అయిన సాధు శుక్వల్లభ్‌దాస్ హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఆస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ హైడ్రాకమిషనర్ ఎ.వి. రంగనాథ్ ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్వల్లభ స్వామిజీ వైదిక మంత్రాలు మరియు స్వస్తివాచనం పఠిస్తూ కమిషనర్‌కు ఆశీస్సులు అందించడంతో సమావేశం ప్రారంభమైంది. అంకితభావం మరియు నాయకత్వంపై తమ అమూల్యమైన మాటలతో అధ్యాపకులను ప్రేరేపించడానికి త్వరలో గురుకుల క్యాంపస్‌ను సందర్శించాల్సిందిగా స్వామిజీ కమిషనర్‌ను అభ్యర్థించారు. కమిషనర్ రంగనాథ్ ఈ అభ్యర్థనను సంతోషంగా అంగీకరించి, సంస్థను తప్పకుండా సందర్శిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ తమ హృదయపూర్వక కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, స్వామినారాయణ్ గురుకుల్ పూర్వ విద్యార్థి అయిన తన కుమారుడు కౌశిక్, ఒక ఆదర్శప్రాయమైన మానవుడిగా, దేశానికి బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదిగాడని, ఇది గురుకుల్ యొక్క వ్యక్తిత్వ వికాసంలో విజయాన్ని స్పష్టంగా చాటిచెప్తోందని తెలిపారు. స్వామినారాయణ్ గురుకుల్ ట్రస్ట్ 77 సంవత్సరాల చరిత్ర కలిగిన లాభాపేక్ష లేని సంస్థ. ఇది విద్యా నైపుణ్యానికి, దేశ వారసత్వం, సంస్కృతి మరియు విలువలను పెంపొందించడానికి అంకితం చేయబడింది. ప్రస్తుతం ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 65 క్యాంపస్‌లలో 1,25,000 మందికి పైగా విద్యార్థులకు సేవలు అందిస్తోంది దీంతో సుఖ వల్లపు స్వామీజీ హైడ్రా కమిషనర్ రంగనాథ్ మర్యాదపూర్వకంగా తమను ఆదరించి అభిమానించినందుకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలలో 'యాంటి డ్రగ్ కమిటీలు' ఏర్పాటు చేయాలి

- మాదకద్రవ్యాల దుర్వినియోగం పై జెఎన్టీయూ యూనివర్సిటీ విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన
- విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 18 : నషా ముక్త్ భారత్ అభియాన్ ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో మహిళా శిశు వికాలంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ ఆధ్వర్యంలోరవాణా పై జెఎన్టీయూ యూనివర్సిటీ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో. జిల్లా న్యాయ అధికార సేవా సంస్థ కార్యదర్శి యువతను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆద్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయముతో సంగారెడ్డి జిల్లా లో మాదక ద్రవ్యాల మహిళా శిశు సంక్షేమఅక్రమ రవాణాను అరికట్టేందుకు మరియు మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అన్ని విద్యాసంస్థల మరియు విశ్వవిద్యాలయాలలో "యాంటి డ్రగ్ కమిటీలు" ఏర్పాటు చేసుకోవాలని ఏదేని అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా యంత్రాంగానికి తెలియపర్చాలని కోరారు. సంగారెడ్డి జిల్లా ను మాదక ద్రవ్య రహిత జిల్లా యే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. అదనపు జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు మరియు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మాదకద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహనా ఉండాలనికల్పించుటకై వివిధ శాఖల సమన్వయము తోతెలంగాణా ప్రభుత్వము "మిషన్ పరివర్తన" కార్యక్రమమును నిర్వహిస్తున్నట్లు గా తెలియజేసారు జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి యువతను ఉద్దేశించి కుమారిమాట్లాడుతూ మాదకద్రవ్యాలను సేవిస్తున్న లేదా విక్రయిస్తున్న "నషా ముక్త్ భారత్ అభియాన్" హెల్ప్ లైన్ నెం.14446 ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. తదనంతరం మాదకద్రవ్యాల దుర్వినియోగం పై జిల్లా అధికారులు పోస్టర్స్ ఆవిష్కరించారు మరియు విద్యార్థులచే నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఇట్టి కార్యక్రమము యందు ఎక్సైజ్ సీఐ జోగిపేట్ సాగర్ రెడ్డి,జన్తు జె ఎన్ టి యూ యూనివర్సిటీ ప్రొఫెసర్ విశ్వనాధ్ రాజు దివ్యాంగుల శాఖ సీనియర్ అసిస్టెంట్ వెంకటేషం, నషాముక్తుభారత్ అభియాన్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమేరా సహిష్ట ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ మరియు మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణా జలాల వినియోగాన్ని తెలుసుకొనేలా టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు ఏపీ సహకరించడం లేదు. నీటిని ఏ రాష్ట్రం ఎంత వినియోగిస్తోందో తెలుసుకొనేందుకు 18 టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటుచేశాం. మరో 20 ఏర్పాటు కావాలి. వీటి ఏర్పాటుకు ఏపీ ముందుకు రావడం లేదు. తన వాటా నిధులూ ఇవ్వడం లేదు. స్టేషన్ల ఏర్పాటుకు ఆ నిధులనూ మేమే ఇస్తామని కేంద్రానికి చెప్పా.
- మంత్రి ఉత్తమ్

ప్రాంతీయం



‘మత్తు’పై విస్తృత అవగాహన

- రంగారెడ్డి కలెక్టరేట్ లో నషా ముక్త్ భారత్ అభియాన్

ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి, నవంబర్ 18: మత్తు పదార్థాలు విక్రయం, సేవనంపై జరిగే అనర్థాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం అవగాహన, పాటు మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. మంగళవార నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి సంగీత మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. మత్తుపదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడ వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా నివారించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీసుశాఖ కృషిచేస్తున్నదని, యువత, సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం యొక్క దుష్ప్రభావాల గురించి యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.డ్రగ్స్ పై చేస్తున్న పోరాటం లో యువత తమ వంతు బాధ్యత నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతోపాటు, తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫర, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియ జేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, డిపిఓ సురేష్ మోహన్, ఈ.డి. ఎస్సీ కార్పొరేషన్ పద్మావతి, పిడి మెప్మా వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు

డ్రగ్స్‌కు దూరంగా దూరంగా వుండాలి

- సంక్షేమ శాఖ ల రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్



ప్రతిపక్షం, సికింద్రాబాద్, నవంబర్ 18: మత్తు రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందని ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గాంధీ మెడికల్ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో నషాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనపై దృష్టిపెట్టాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ వాడకం సరదాగా మొదలై చివరకు విద్య, కుటుంబం, భవిష్యత్తును నాశనం చేసే స్థాయికి చేరుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని మత్తు పదార్థాల బారినుంచి పూర్తిగా బయటపడేలా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఈగల్ స్పెషల్ యూనిట్ రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ సరఫరా మార్గాలపై నిఘా ఉంచి మాఫియాను ఒక్కో దశలో ఛేదిస్తోందని వివరించారు. నగరాల్లో, విద్యాసంస్థల వద్ద, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో జరిగే మత్తు లావాదేవీలను గుర్తించేందుకు రియల్ టైమ్ ఇంటెలిజెన్స్, డేటా విశ్లేషణతో వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించినట్లు మంత్రి చెప్పారు. ఇప్పటివరకు 15,891 విద్యాసంస్థల్లో జరిగిన 7,018 అవగాహన కార్యక్రమాల ద్వారా 1.45 కోట్ల మందికి మత్తు దుష్ప్రభావాలపై అవగాహన కల్పించామని తెలిపారు. ఇది దేశంలోనే అతిపెద్ద డ్రగ్స్ అవగాహన కార్యక్రమమని స్పష్టం చేశారు.యువత పునరావాసం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సైదాబాద్ అబ్జర్వేషన్ హోమ్‌లో పిల్లల కోసం డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు, చెర్లపల్లి, నిజామాబాద్, చంచల్‌గూడ, సంగారెడ్డిలో జైళ్లలో ప్రత్యేక చికిత్సా సేవలు ప్రారంభించామని పేర్కొన్నారు. పది జిల్లాల్లో ఎన్జీవోలతో కలిసి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, త్వరలో పన్నెండు జిల్లా ఆసుపత్రుల్లో కొత్త చికిత్సా సెంటర్లు ప్రారంభమవనున్నాయని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైతే ఒక్కరి జీవితం మాత్రమే కాదు, మొత్తం కుటుంబం నష్టపోతుందని, మత్తును విడిచిపెడితే కొత్త జీవితం మొదలవుతుందని మంత్రి అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి చదువు, కెరీర్, విజయాలకు దగ్గరగా ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాకారులు ప్రదర్శించిన నాటకాలు, పాటలు, ఆటలు యువతలో అవగాహన పెంచాయని పేర్కొన్నారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనలో సేవలందిస్తున్న వాలంటీర్లను సన్మానించారు. తరువాత గాంధీ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులతో కలిసి డ్రగ్ నిరోధక 2025 ప్రతిజ్ఞను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేయించారు. కార్యక్రమంలో మహిళా & శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, టీజీ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, విభాగం డైరెక్టర్ శైలజ, గాంధీ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, ఎస్పీ సీతారాం తదితరులు పాల్గొన్నారు.



వెలిమెల విద్యార్థుల విహారయాత్రకు సహాయం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 18 : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఇటీవల ప్రవేశపెట్టిన ‘యాత్ర దానం’ కార్యక్రమానికి గ్రామ స్థాయిలో మంచి స్పందన లభిస్తోంది. వెలిమెల గ్రామానికి చెందిన ఆశం గారి వీరమ్మ, ఆమె కుమారుడు ఆశం గారి రాజు, సామాజిక సేవలో భాగంగా వెలిమెల జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థుల విహారయాత్ర కోసం ముందుకు వచ్చి దాతృత్వ సహాయంగా చెక్కును అందించారు. స్కూల్ హెడ్ మాస్టర్ సుభాష్, ఉపాధ్యాయుడు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో, ఆర్టీసీ బస్ స్టేషన్ మేనేజర్ ఇస్సాక్, ఆర్టీసీ కాలనీ బస్సు ఆఫీసర్ రవికుమార్ సమక్షంలో చెక్కును అందజేసారు. విద్యార్థుల అధ్యయన వికాసం, వ్యక్తిత్వ అభివృద్ధికి ఇటువంటి విహారయాత్రలు ఎంతో ఉపయుక్తమని అధికారులు అభిప్రాయపడ్డారు. గ్రామస్థులు ఆశం గారి కుటుంబం చేసిన దాతృత్వాన్ని అభినందించారు. యాత్ర దానం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నందుకు, సహకరించిన ప్రతీ ఒక్కరికీ హెచ్.సి.యూ డిపో మేనేజర్ శ్రీనాథ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్రా యాత్రలో హైదరాబాదీల మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది

- కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రతిపక్షం, కూకట్ పల్లి, నవంబర్ 18 : ఉమ్రా యాత్రకు వెళ్లిన హైదరాబాదీలు చనిపోవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మక్కా ప్రమాదంలో మరణించిన కూకట్పల్లి నియోజకవర్గంలో ని అల్లాపూర్ డివిజన్ పద్మావతి నగర్‌కు చెందిన రహీమున్నీసా కుటుంబ సభ్యులను కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌసుద్దీన్‌తో కలిసి మాధవరం కృష్ణారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో లింగాల ఐలయ్య, జావీదుద్దీన్, మొయిన్, మహమ్మద్ నూర్ ఖాన్, షైక్ ఇస్మాయిల్, చాంద్ సాబ్, నిజాం, కమల్, అబ్దుల్ హమీద్, సలీం, మల్లికార్జున్, జుబేర్, యోగి రాజు, పర్వీన్ సుల్తానా, నజ్మా తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లాకు జల సంచాయ్‌జన్ భాగీదారి అవార్డు

- న్యూఢిల్లీలో అవార్డు స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం, నిర్మల్, నవంబర్ 18: మరోసారి జాతీయ వేదికపై నిర్మల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. నిర్మల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయిజన్ భాగీదారి అవార్డు లభించింది. మంగళవారం, కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ వేదికయ్యింది. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందిస్తూ, జిల్లాకు జలసంచాయ్‌జన్ బాగీదారి అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘన సాధ్యమైందని స్పష్టం చేశారు. అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు వీరందరికీ చెందుతుందని తెలిపారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఉన్నారు. నిర్మల్ జిల్లాకు జల సంచాయ్ జన భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు స్వీకరించిన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రతిపక్షం, పరిగి, నవంబర్ 18 : రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల మీద బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు పరిగి నియోజకవర్గం పరిధి పూడూరు మండల కేంద్రంలో పత్తి రైతులు కోసం పూడూరు పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి , వికారాబాద్ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు మెతుకు ఆనంద్ తో కలిసి మాజీ మంత్రి మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పత్తి రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్షత చూపుతున్నాయని అన్నారు. అకాల వర్షాలతో, అననుకూల వాతావరణ పరిస్థితులతో ఇప్పటికే దిగుబడి రాక అతలాకుతలమవుతున్న పత్తి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందిందని. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రాష్ట్రంలో ఏ మార్కెట్లో కూడా అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు రైతులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 18 : శరవేగంగా విస్తరిస్తున్న పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోబోతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. భూముల పరిరక్షణకు ప్రజలందరూ సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్బో మెడోస్ కాలనీలో ప్రభుత్వ భూమి వివాదంపై ఎమ్మార్వో వెంకటేశం, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కృష్ణలతో కలిసి ఆయన మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, రెవెన్యూ అధికారులు, గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, డెవలపర్స్ తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్న లక్ష్యంతో ఇళ్లను కొలుగోలు చేసిన కాలనీ వాసులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు. అందరి సమక్షంలో మరోమారు జాయింట్ సర్వే నిర్వహించి పూర్తి న్యాయం చేస్తామని తెలిపారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూముల వివరాలను సేకరించి.. కబ్జాలకు గురికాకుండా పూర్తిస్థాయి రక్షణ ఏర్పాట్లు చేయబోతున్నట్లు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ పార్కులు, రహదారులను కబ్జా చేసి.. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. గజం భూమి కబ్జాకు గురైన కబ్జాదారులు జైలు ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కొన్ని మండలాల పరిధిలో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడానికి ప్రభుత్వ భూములు దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ ఫంక్షన్ హాల్లు, విద్యాసంస్థలు, సబ్ స్టేషన్లు, గోదాముల, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను వినియోగించబోతున్నట్లు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని కోరారు.



“



కేంద్రంతో కుమ్మక్కై విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించే కుట్రలకు చంద్రబాబు తెరలేపారు. వైట్ ఎలిఫెంట్ అన్న ఆయన వ్యాఖ్యలే నిదర్శనం. ఎన్డీయేలో భాగం కాకున్నా జగన్ తన హయాంలో ప్రైవేటుపరం కాకుండా ఆపారు. కానీ ఇప్పుడు కేంద్రం టీడీపీ సపోర్టుతో నడుస్తున్నా ఆ దిశగా కదులుతోంది. ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు బాబు ప్లాంటుకు వెన్నుపోటు పొడుస్తున్నారు.

- ఏపీ మాజీ మంత్రి రజిని

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- నల్లగొండ జిల్లా కలెక్టరేట్ వద్ద రైతు దీక్షకు ఏలేటి సంఘీభావం
- దీక్ష విరమింప జేసిన బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 18: బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నల్లగొండ జిల్లా కలెక్టరేట్ వద్ద బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 24 గంటల పాటు చేపట్టిన రైతు నిరాహార దీక్ష కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. అనంతరం నిరాహార దీక్ష చేస్తున్న నాయకులతో దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను తుంగలో తొక్కి రైతులను మోసం చేస్తూ పాలన కొనసాగిస్తున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నకలకు ముందు వరంగల్ డిక్లరేషన్ లో చేసిన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. రైతులు కష్టపడి పండించిన పంట అకాల వర్షాలతో చేతికి రాకుండా పోవడం బాధాకరం అన్నారు. పంట నష్ట పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాగో నష్ట పరిహారం ఇవ్వడంలేదని, కనీసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన అమలుపరిస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఫసల్ బీమా యోజనను రాష్ట్రం లో అమలు పరచకుండా రైతులను ఈ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. మహిళలకు 2500 లు, విద్యార్థులకు స్కూటీ లు, నిరుద్యోగులకు భృతి, ఇలా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని అన్నారు. ఉద్యమాల గడ్డ నల్గొండ మీద మొదలైన ఈ ఉద్యమం ప్రతీ జిల్లాకు విస్తరింప జేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లాకు చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులు మహేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీ చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి , చెల్లా శ్రీలత రెడ్డి, జిల్లా బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం ఐక్యత

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 18: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం నేటికీ ఐక్యతతో ఉందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్ సి సి సంస్థల ఆధ్వర్యంలో సర్దార్@150 ఐక్యత పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమాలవేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహబరీష్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత దేశంలో స్వేచ్ఛ కోసం తపించేవారని, ఎన్ని భాషలు మాట్లాడిన ఎన్ని ప్రాంతాలు ఉన్న మనమందరం ఒకటేనని చాటి చెప్పేవారని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో సర్దార్ పటేల్ కృషి చేశారన్నారు. భారత దేశ ప్రజల్ని చైతన్యపరిచి ఏకతాటిపై నడిపించిన మహనీయుడని కొనియాడారు. అలాగే డ్రగ్స్ రహిత భారత దేశంగా తీర్చిదిద్దడానికి భారత ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞను యువతకు చేయించారు. అనంతరం కలెక్టర్ జెండా ఊపి పాద యాత్రను ప్రారంభించడం జరిగింది. ఐక్యత పాదయాత్ర కేడీసీ కాలేజ్ గ్రౌండ్ నుండి ప్రారంభమై పోలీస్ కమిషనరేట్ మీదుగా అంబేద్కర్ సర్కిల్, కాళోజి కూడలి, ఏకశిలా పార్క్, బాలాసముద్రం, హనుమకొండ బస్ స్టేషన్ మార్గం నుండి తిరిగి కేడిసి కాలేజ్ గ్రౌండ్స్ కు చేరింది. ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోతు దేవిలాల్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కాకతీయ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, కాకతీయ యూనివర్సిటీ స్టూడెంట్స్వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ ఇస్తారి, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ అప్పయ్య, ప్రభుత్వం చే నామినేట్ అయిన మెంబర్స్ జయంత్ లాల్, సాంద్ర మధు, తీగల భరత్, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సిసి నుండి 10టి, 4 ఎయిర్, 1 సి టి ఆర్, 8T బెటాలియన్స్, అలాగే మెప్మా మహిళా సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సుమారు 2000 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





‘నారసింహ’ నామస్మరణలతో

మారుమ్రోగిన నాచ‘గిరి’ ప్రదక్షిణ

- భక్తులను ఆకట్టుకున్న "జ్వాలాతోరణం"

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 18: నారసింహ నామ స్మరణలతో, లోక శాంతి, కుటుంబ శాంతి, మనశ్శాంతి, అన్నియు లభించునని మరియు ప్రతినెల జరుగు "గిరి" ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొనినచో సమస్త దోషములు పోవునని రంగంపేట పీఠాధిపతులు మాధవానంద సరస్వతి అన్నారు. మంగళవారం నాడు వర్గల్ మండలం నాచారంగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి పురస్కరించుకొని మాధవానంద సరస్వతి స్వీయ పర్యవేక్షణలో గిరిప్రదక్షిణ కార్యక్రమం ఉదయం భక్తుల "నారసింహ" నామస్మరణలతో జరిపించారు. తన అనుగ్రహ భాషణలో, నారసింహ స్మరణలతో, లోక శాంతి, కుటుంబ శాంతి, మనశ్శాంతి, అన్నియు లభిస్తుందని ఉద్ఘాటించారు. సాయంత్రం భక్తులచే ఆకాశదీపం మరియు జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించడంతో పాటు శివతాండవం కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నరసారెడ్డి, దేవస్థాన చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా, ధర్మకర్తలు చందా నాగరాజు, గాలి కిష్టయ్య, కర్రే పద్మా వెంకటేష్, కొత్తపల్లి శ్రీనివాస్, తిరుమల రావు ,సురేందర్ రెడ్డి, ఉపశ్రీ రాజశేఖర్ శర్మ, కార్యతీర్వాహణాధికారి వి .విజయరామారావు, సహాయ అధికారి సుధాకర్ అర్చకులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్య దేశంలో

ఓటు హక్కు వజ్రాయుధం

- పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్

ప్రతిపక్షం, రాయపోల్, నవంబర్18: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. ఎం విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కవి, గాయకులు జొన్నోజి నాగులు రచించిన ‘ఓట్ల పండుగ’ ఓటర్ చైతన్య గీతాన్ని కమిషనర్ విజయ్ కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరికీ డా. బీఆర్ అంబేద్కర్ ఓటు హక్కును కల్పించాడాని, ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో స్వచ్ఛందంగా వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం, ఓటు హక్కు ద్వారానే ప్రజలను పరిపాలించే నాయకులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు యొక్క ప్రాధాన్యత చాలా గొప్పదని ,ఓటు హక్కును ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా మీకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. ఓటర్లను చైతన్యం చేసే విధంగా, సరైన నాయకులను ఎన్నుకునే విధంగా అవగాహన కల్పించాలని తన వంతు సామాజిక బాధ్యతతో పాటను రాసి ప్రజలలోకి తీసుకువెళ్తున్న కవి, గాయకులు జొన్నోజి నాగులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఓట్ల పండుగ పాట రచయిత జన్నోజి నాగులు,జర్నలిస్టు పుట్ట రాజు పాల్గొన్నారు.



ఉపాధి కల్పనకు మహిళా సంఘాలు దోహదం

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 18: నిరుపేద మహిళలకు ఉపాధి కల్పించుకోవడానికి మహిళా సంఘాలు ఎంతగానో దోదపడతాయని డీఆర్డీఓ జగదేవ్ ఆర్య, డీపీఎం వాసుదేవ్ అన్నారు. మిడిదొడ్డి మండలం అల్వాల గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ధర్మారం గ్రామంలో మదర్ యూనిట్ ద్వారా నాటు కోళ్ల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందడానికి మదర్ యూనిట్ ద్వారా కోళ్లను, గొర్రెలు వంటివి మహిళలకు అందించి ఉపాధిని కల్పించుకోవడానికి అనేక సౌకర్యాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు వరి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. రైతులు దళాలను ఆశ్రయించకుండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రామ్ లాబ్ ,మదర్ యూనిట్ ద్వారా కోళ్లు, పొట్టేల్లు, గొర్రెలను పెంపకం ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనరసమ్మ, సీసీ వైకుంఠం జ్యోతి తోపాటు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది గైర్హాజరుపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 18: మండలంలోని అహ్మదీపూర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి మంగళవారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం సమయపాలన పాటించని మెడికల్ ఆఫీసర్ తో సహా మిగిలిన సిబ్బంది అందరూ గైర్హాజరుపైన ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేసి గైర్హాజరు అయిన వారి వివరాలను నమోదు చేసి ఒక రోజు సాలరీ కట్ చేయాలని, సమయానికి రాకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డి ఎం అండ్ హెచ్ ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు.



ధాన్యం కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 18: ధాన్యం కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని దుబ్బాక ఏడిఏ మల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని పారదర్శకంగా కొనుగోలు జరిగేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. తూకం వేసిన ధాన్యం వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంతోష్ కుమార్ పాల్గొన్నారు...



అధిక వడ్డీ వసూలు చేస్తున్న

వ్యాపారి అరెస్టు

ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 18: అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, పలువురిని ఇబ్బందులకు గురి చేస్తున్న వడ్డీ వ్యాపారిని అదుపులోకి తీసుకున్న ఘటన దుబ్బాక మండలం గంభీర్పూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం... గంభీర్పూర్ గ్రామంలో చింతు గణేష్ అనే వడ్డీ వ్యాపారి బంగారం, వ్యవసాయ పత్రాలు, వాహన పత్రాలు కుదువ పెట్టుకుని, అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, పలువురిని ఇబ్బందుల గురి చేస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు దుబ్బాక పోలీసులు సోమవారం అతని ఇంటిపై దాడి చేసి, అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి నాలుగు కార్లు, ఒక ట్రాక్టర్, ఏడు ద్విచక్ర వాహనాలు, ప్రామిసరీ నోట్లు, వ్యవసాయ భూముల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సుమోటోగా ఫిర్యాదు తీసుకుని, వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



దళితరత్న అవార్డు గ్రహీత రామస్వామికి నివాళి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 18: ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎంఈఎఫ్ (మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్) అధ్యక్షులు, దళితరత్న అవార్డు గ్రహీత, రిటైర్డ్ వార్డెన్ ఏటి రామస్వామి కన్నుమూసిన నేపథ్యంలో, ఆయన స్వగ్రామం పాలమాకులలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రముఖులు, కులబాంధవులు ఘనంగా నివాళులు అర్పించారు.జాతి సమస్యల పరిష్కారం, దళిత సమాజం పురోగతికి జీవితాంతం అంకితభావంతో పనిచేసిన రామస్వామి సేవలను స్మరించుకుంటూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎం.ఈ.ఎఫ్ నాయకులు గుర్రాల శ్రీనివాస్ మాదిగ, దండు శంకర్, పెద్దమాతరి బాబు, మేకల నర్సింహులు మాదిగ, పొన్నాల మల్లేశం మాదిగ, ముస్త్యాల బాలనర్సయ్య మాదిగ, డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ మాదిగ, దప్పు శివరాజ్ మాదిగ, జాంగిర్ మాదిగ, వాటు వెంకట్ మాదిగ, దెబ్బేట యాదగిరి మాదిగ, జెరిపోతుల శ్రీనివాస్, ఎడ్ల శంకర్ మాదిగ, జింక సంజీవ్ మాదిగ, గుండి సంజీవులు, దేవులపల్లి చంద్రం , ఎనగందుల యాదగిరి, రాములు , కొంపెల్లి ప్రభుదాసు , చందులపురం కనకయ్య పాల్గొన్నారు.



మామిడి రామా రెడ్డి సేవలు చిరస్మరణీయం

- సహకార వికాస సంస్థ మేనేజర్ లక్ష్మణ్, కోశాధికారి రేవతి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 18: గ్రామీణ ప్రాంతాల్లో కర్షకులు, బడుగు-బలహీన వర్గాల అభివృద్ధిని లక్ష్యంగా ఏర్పాటైన సహకార వికాస సంస్థకు స్థాపకుడైన మామిడి రామా రెడ్డి చేసిన సేవలు మరువలేనివని సంస్థ మేనేజర్ లక్ష్మణ్, కోశాధికారి రేవతి పేర్కొన్నారు. 1975లో సంస్థను స్థాపించి, 1995లో సహకార చట్టం రూపుదిద్దుకోవడంలో ఆయన కీలకపాత్ర పోషించారని వారు గుర్తుచేశారు. ఇటీవల మామిడి రామా రెడ్డి మరణించడంతో ఆయన స్మరణార్థంగా సిద్దిపేట మిలన్ గార్డెన్‌లో సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని, గ్రామీణ అభివృద్ధికి చేసిన కృషిని సభలో పాల్గొన్న ప్రతినిధులు స్మరించారు. మొత్తం 612 సంఘాలను ఏర్పాటు చేసి, వాటి పనితీరుకు అనుగుణంగా పద్ధతులను రూపొందించడం రామా రెడ్డి జీవితంలో అత్యంత ప్రాముఖ్యమైన సేవలని పేర్కొన్నారు. సహకార వికాస సంస్థ సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ అర్బన్-రూరల్ జిల్లాల్లో సేవలను అందిస్తూ ఉందని తెలిపారు. రామా రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామని ప్రతినిధులు స్పష్టం చేశారు.



కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కమిటీ ఎన్నిక

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 18 : ఉప్పల్ పోచమ్మ దేవాలయంలో కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో అన్ని జిల్లాల నాయకులు కలిసి నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. కుండె వెంకటేష్ కురుమ ను రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా గొరిగె నర్సింహా కురుమ, గౌరవ సలహాదారులుగా కొడే పోచయ్య కురుమ, గౌరవ న్యాయ సలహాదారులుగా నోముల ప్రసన్న కుమార్, కురుమ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కమిటీని నియమించారు. ప్రతి 2 ఏళ్లకు ఏ విధంగా ఎన్నిక జరుగుతుందో ఈ సారి కూడా పెద్దల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొల్లు రమేష్ కురుమ, కొత్తూరి చంద్రమౌళి కురుమ, మీస సత్యనారాయణ కురుమ, ఎల్లమ్మల కృష్ణ రాజు కురుమ, ప్రధాన కార్యదర్శిగా గౌడ రాజ్ కుమార్ కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కానుగంటి వెంకటేష్ కురుమ, కోశాధికారిగా రావుల ఐలయ్య కురుమ, రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం కేవైసీఎస్ భవిష్యత్తులో కులం కోసం పని చేస్తుందని, తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న తప్పకుండ కేవైసీఎస్ నిలబడుతుందని రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు.





గ్యాస్ సిలిండర్ పేలి ఆరుగురికి తీవ్ర గాయాలు

- క్షతగాత్రులను గాంధీ ఆసుపత్రికి తరలింపు
- మంటల్లో ఇల్లు దగ్ధం.. 20 లక్షల ఆస్తి నష్టం

ప్రతిపక్షం చేర్యాల, నవంబర్ 18 : గ్యాస్ సిలిండర్ పేలి కుటుంబ సభ్యుల ఆరుగురికి తీవ్ర గాయాలై ఇల్లు దగ్ధమైన సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శెట్టె భాస్కర్ టీ పెట్టేందుకు గ్యాస్ ముట్టించగా సిలిండర్ లీకై ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న భాస్కర్ తో సహా తండ్రి అయ్యల్లం, భార్య కావ్య, కుమార్తెలు ప్రణవి, కృతిక, హర్షిని లకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఇల్లు దగ్ధమైంది. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇల్లుతో పాటు విలువైన వస్తువులు, సామాగ్రిలు, డబ్బులు మంటల్లో బూడిదపాలై సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. సంఘటనా స్థలానికి చేర్యాల సీఐ లక్కేపురం శ్రీను, ఎస్ఐ వేముల నవీన్ చేరుకొని ఇల్లును పరిశీలించారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి ఆ నిరుపేద కుటుంబాన్ని ఆదుకొని, చేర్యాలలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ డిమాండ్ చేశారు.



గిల్ సౌతాఫ్రికాతో రెండో టెస్టు ఆడతారా, లేదా? అన్న దానిపై స్పష్టత రాలేదు. ఆడకపోతే అతని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌ని తీసుకోవాలి. గిల్ స్థానంలో ఆడేందుకు సాయి సుదర్శన్, పడిక్కల్ ఉన్నారు. కానీ వారిలో ఎవరిని తీసుకున్నా జట్టులో ఏడుగురు లెఫ్టార్మ్ బ్యాటర్లవుతారు. అది మంచిది కాదు. రుతురాజ్ డొమెస్టిక్‌గా బాగా రాణిస్తున్నారు. అతనే కరెక్ట్ అనిపిస్తోంది.

- భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా



మల్లన్న స్వామి కళ్యాణం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 18: కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి కళ్యాణం, జాతర బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె.హైమావతి పరిశీలించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి కొమరవెల్లి మండల కేంద్రంలో పర్యటించి కొమరవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి వారి కళ్యాణం, బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లు, వివిధ శాశ్వత ఇంజనీరింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొమురవెల్లిలో వాహన పార్కింగ్ స్థలం, నిర్మాణంలో ఉన్న క్యూలైన్ కాంప్లెక్స్, ఆలయం పరిసరాల్లో రద్దీని, షాపులను, పంచాయతీరాజ్ ద్వారా 50 గదులతో నిర్మిస్తున్న సత్రం నిర్మాణ పనులు మరియు కళ్యాణం జరిగే మండపం ప్రాంతంను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొమరవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి కళ్యాణం, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నిన్న సోమవారం హైదరాబాదులో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ, దేవదాయశాఖ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించి ఉత్సవాల నిర్వహణపై తగు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. డిసెంబర్ 14వ తేదీన జరిగే కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి కళ్యాణంతో పాటు 18 జనవరి 2026 నుండి 16 మార్చి 2026 వరకు జరిగే జాతర బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ఆలయ సంప్రదాయం ప్రకారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేలా స్వామి వారి కళ్యాణాన్ని భక్తులు సంతోషంగా తిలకించేలా ఏర్పాట్లను ఇప్పటినుండే పగడ్బందీగా చేయాలని, పార్కింగ్, రహదారుల మరమ్మత్తు, రోడ్ల వెంబడి చెత్తా, చెదారం తొలగింపు, విద్యుత్ లైన్లను సరి చూసుకోవడం, భక్తులు స్నానం చేయడానికి శాశ్వత నిర్మాణాలు, శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం, గుడి గుడి ఆవరణతో పాటు నూతనంగా నిర్మిస్తున్న 50 గదులకు త్రాగునీరు సరఫరా, రన్నింగ్ వాటర్ సరఫరా తదితర పనులను ముందస్తుగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, కొమరవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానం ఈఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ బుద్ది శ్రీనివాస్, ఆలయ ప్రధాన పూజారి మల్లికార్జున్, డిపిఓ విజయ్ కుమార్, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఇఇలు, స్థానిక తహసిల్దార్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సహజ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వాలి

- వైద్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 18: మాత శిశు ఆరోగ్య కేంద్రం లో సహజ ప్రసవాలు సంఖ్యను పెంచుతూ గర్భవతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి, మరియు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమలు, గనుల, భూ గర్భశాస్త్ర శాఖ మంత్రి జీ. వివేక్ వెంకట స్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆకస్మికంగా సందర్శించి డాక్టర్ లు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నెలకు మూడు నుండి నాలుగు వందల వరకు ప్రసవాలు జరుగుతున్నట్టు తెలిసిందన్నారు. అంతేకాకుండా ప్రసవాలలో సిజేరియన్ కాకుండా నార్మల్ డెలివరీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ పేషంట్లతో అన్యోన్యంగా డాక్టర్లు మెలగాలని తెలిపారు. హాస్పిటల్ పరిసర వాతావరణం బాగుంది కాబట్టి పేషెంట్స్‌కు ఇంకా మెరుగైన సేవలు అందించడానికి హాస్పిటల్ కు కావలసిన మౌలిక వసతులు, సౌకర్యాలు, వైద్య పరికరాలు అందిస్తామని, వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే డాక్టర్ ల విధి అని విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి, ఎంఎల్ సి యాదవ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, ఆర్డీఓ చంద్రకళ, డి సి ఎచ్ ఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శించిన బక్కి

ప్రతిపక్షం, అక్బరుపేట/-భూంపల్లి, నవంబర్ 18: పోతారెడ్డిపేట గ్రామంలో ఇటీవల కుర్మ బాలయ్య అనే వ్యక్తి పాముకాటుకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మంగళవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంద చంద్రసాగర్, దయాకర్ రెడ్డి, మురళి చింత జగన్ గుర్రాల యాదగిరి ఎల్కపల్లి మహిపాల్, మంద స్వామి బ్యాగారి కృష్ణ గోప రాములు, మంద నాగరాజు, మంద లక్ష్మినార్సిములు పుట్లగారి నగేష్ మంద మహేష్, కోమిరే స్వామి, కలుబండి ఎల్లం, ఉరెల్లి రాజమల్లు, ఉడుత దుబ్బారాజి మొర చెంద్రము, జ్ఞాన్ కుమార్, ఇతరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- ప్రసూతి,శిశు వైద్య విభాగాలను బలోపేతం చేసే దిశగా చర్యలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 18: వైద్య విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అత్యంత నాణ్యత ప్రమాణాలతో క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణం చివరి దశలో ఉందని, ప్రసూతి, శిశు వైద్య విభాగాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ పట్టణ పిల్లికొట్టాల్ లో మెడికల్ కళాశాల ,నిర్మాణం పూర్తి దశలో ఉన్న క్రిటికల్ కేర్ సెంటర్, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు.ముందుగా మెడికల్ కళాశాలలోతరగతి గదులు, ల్యాబులు, డెమోరూమ్లు ,లైబ్రరీ లను పరిశీలించారు. విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మొదటి సం: లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. మెడికల్ విద్యార్థులు ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని,ర్యాగింగ్ చట్టాలు కఠినంగా ఉన్నాయని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... వైద్య విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా,అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఈ నెలలోనే రెండవ సం; విద్యార్థులకు తరగతులు ప్రారంభం కావడంతో వారికి హాస్టల్ సదుపాయం,ప్రశాంత వాతావరణంలోతరగతులు, ప్రాక్టికల్స్, డెమోలు నిర్వహించి ఉన్నత వైద్య విద్యార్థులు గా తీర్చి దిద్దాలన్నారు.మెడికల్ కళాశాల లో ఏవైనా పెండింగ్ పనులుంటే వెంటనే పరిష్కరించలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణం చివరి దశలో ఉన్న క్రిటికల్ కేర్ సెంటర్ ను పరిశీలించారు. తొందరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మాతా శిశు కేంద్రంలో రోగులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలో అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, సూపరిడెంట్ సునీత, డీసీహెచ్ ఎస్.శివదయాల్, వివిధ ప్రొఫెసర్లు, ఆరోగ్య శాఖా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- ఈనెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు
- -రేవా రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 18: ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగ ఉపాధ్యాయుల ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(రేవా)రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం జిల్లా అధ్యక్షుడు పొన్నమల్ల రాములు అధ్యక్షతన సిద్దిపేటలోని ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కోహెడ చంద్రమౌళి మాట్లాడుతూ 20 నెలలుగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన జీపీఎఫ్, జీఐఎస్, సెలవు నగదు, కమ్యూటేషన్ గ్రాట్యూటీ, అందలేదని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వెంటనే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీంతో చాలామంది అనారోగ్యం పాలవుతూ చనిపోతున్నారన్నారు. ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ బకాయిలు వచ్చేంతవరకు పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్త రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని అన్నారు. రేవా రాష్ట్ర కో కన్వీనర్ భరత్ సత్యనారాయణ మాట్లాడుతూ పెన్షనర్లందరికీ ఏకమొత్తంగా రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం మీద తీవ్ర ఒత్తిడి తెస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానసిక వేదనతో బాధపడుతున్న పెన్షనర్లకు ఇబ్బంది కలిగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగిరెడ్డి, కోశాధికారి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు పోలీసు రాజు, ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో అక్రమ వడ్డీ వ్యాపారి అరెస్ట్

- 9 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు స్వాధీనం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 18: అమాయక ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి, వారి వాహనాలను తాకట్టు పెట్టుకుని అక్రమ లాభాలు గడిస్తున్న వ్యక్తిని సిద్దిపేట టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. రాంనగర్‌కు చెందిన కిర్ని అనిల్ కుమార్ కొంతకాలంగా ప్రజలకు వాహనాలను తాకట్టు పెట్టి అవాస్తవ వడ్డీలతో అప్పులు ఇస్తూ వస్తున్నాడు. ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.మంగళవారం ఉదయం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బి. ఉపేందర్ సిబ్బందితో కలిసి రాంనగర్ ప్రాంతంలో నిందితుడిని అరెస్టు చేశారు. విచారణలో భాగంగా అతని వద్ద ఉన్న 9 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు స్వాధీనం చేసినట్లు పోలీసులు తెలిపారు.జిల్లాలో ఇలాంటి అక్రమ వడ్డీ వ్యాపారాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులను సంప్రదించాలని ఇన్స్పెక్టర్ బి. ఉపేందర్ సూచించారు.



చేనేత వృత్తికి సంపూర్ణ సహకారం అందిస్తాం

- జిల్లా సహకార అభివృద్ధి అధికారి వరలక్ష్మి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్18: చేతివృత్తైన చేనేత వస్త్ర ఉత్పత్తికి ప్రభుత్వ తోడ్పాటుతో సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా సహకార అభివృద్ధి అధికారి వరలక్ష్మి అన్నారు. 72 వ అఖిలభారత సహకార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నాడు స్థానిక చేనేత సహకార సంఘ ఆవరణలో సహకార జెండా ఆవిష్కరణ అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాడు ఎంతో ప్రసిద్ధిగాంచిన చేతి వృత్తి "కళ" నేడు వచ్చిన యాంత్రికరణ ద్వారా కార్మికులకు పని కల్పించడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయిన నేడు కొందరు చేనేత వృత్తిపై ఆధారపడి జీవించేవారు ఉండడం గర్వించదగ్గ విషయం అన్నారు. రానున్న రోజుల్లో మరింత పోటీతత్వం ఉంటుందని దానిని ఎదుర్కొనేందుకు వచ్చే తరం యువకులు సిద్ధంగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్ రెడ్డి, చేనేత జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి అంజయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు దేవదాస్, గజ్వేల్ ఉన్ని పారిశ్రామికుల సంఘం బాధ్యులు బాలచంద్రం, సిద్దిపేట చేనేత సంఘం బాధ్యులు శ్రీనివాస్, జిల్లా సహకార బ్యాంక్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.



‘టెట్’ మినహాయిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేయాలి

- పీఆర్టీయూ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 18: టెట్ నుంచి మినహాయిస్తూ పార్లమెంట్లో చట్ట సవరణ చేయాలని పీఆర్టీయూ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ పట్టణంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఉపాధ్యాయులందరూ ఉద్యోగంలో కొనసాగాలంటే రెండు సంవత్సరాలలోపు తప్పనిసరిగా టెట్ పాసు కావాలనడం ఉపాధ్యాయులను ఎంతో మనోవేదనకు గురిచేస్తుందన్నారు. 25, 30 సంవత్సరాల సర్వీసు కలిగిన ఉపాధ్యాయులు ప్రస్తుతం టెట్ రాసి పాస్ కావడం అంటే చాలా శ్రమతో వేదనతో కూడుకున్నదన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వము స్పందించి విద్యాహక్కు చట్టం 2009లోని సెక్షన్ 23 అండర్ 2 సెక్షన్ ను సవరించి ఉపాధ్యాయులకు 2010 కంటే ముందు నియామకమైనటువంటి ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇస్తూ చట్ట సవరణ చేయాలి అని డిమాండ్ చేశారు. 2010 కంటే ముందు నియామకమైనటువంటి ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష పాస్ కావడం నుంచి మినహాయింపు కోరుతూ చట్ట సవరణ చేయాలనే అనే డిమాండ్తో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులగం దామోదర్ రెడ్డి, సుంకరి బిక్షం గౌడ్ ఢిల్లీలో ఉండి కేంద్ర ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రిని,ఇతర మంత్రులను ఎన్సిటిఈ అధికారులను కలుస్తూ చట్ట సవరణ కోసము గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని వారు తెలిపారు.ఈ సమావేశంలో పీఆర్టీయూ నాయకులు ఉన్నారు.

మంత్రి కొండ సురేఖతోనే మల్లన్న ఆలయ అభివృద్ధి

- కాంగ్రెస్ కొమురవెల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్



ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 18: రాష్ట్ర దేవాలయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖతోనే మల్లన్న ఆలయం అభివృద్ధి చెందుతున్నాదని కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొమురవెల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొమురవెల్లి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ నెలకొని ఉన్న పలు సమస్యలను జనగామ అసెంబ్లీ ఇన్చార్జి, జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి, రాష్ట్ర దేవాలయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకు వెళ్లగా వాటిని పరిశీలించి అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. కొమురవెల్లిలో సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకొని గతంలో ఉన్న స్పెషల్ దర్శనాలను రూపాయలు రూ.150 మరియు 500 మాత్రమే ఉంచి గతంలో ఉన్న 100 రూపాయల దర్శనాన్ని రద్దు చేయడం జరిగిందని, దీనితో సామాన్య భక్తులు ధర్మ దర్శనానికి వెళ్లడానికి రెండు లైన్లు ఉపయోగపడతాయని, ఎక్కువ మంది ధర్మ దర్శనం చేసుకోవడానికి వీలవుతుందని అన్నారు. శానిటేషన్ కార్మికుల సంఖ్య 300కు పైగా ఉండేటట్టు చూడమని మంత్రి ఆదేశించడం జరిగిందని, ఇందులో కేవలం దేవస్థానం మీద భారం వేయకుండా ప్రభుత్వం నుండి కూడా సగం మందిని నియమించాలని మంత్రి ఆదేశించడం జరిగిందని అన్నారు. కొమురవెల్లి ఆర్చ్ గేటు వద్ద భక్తులు రోడ్డు క్రాస్ చేయడానికి ఇబ్బంది పడడం గతంలో అక్కడ యాక్సిడెంట్లు జరిగి ప్రాణాలు కూడా కోల్పోవడం జరిగిందని, ఈ విషయంపై స్పందించిన మంత్రి అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడం కోసం ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. అలాగే జాతర సమయంలో రద్దీ ఉన్న వారాల్లో వాహనాలను దూరం నిలపడం చేత అక్కడి నుండి దేవాలయంకు రావడానికి భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రెండు ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశించడం జరిగిందని అన్నారు. వీటితో పాటు కొమురవెల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి జాతర ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వం నిధులు వచ్చేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాలను తీసుకువెళ్లి ప్రభుత్వం తరఫున నిధులు ఇప్పిస్తానని మంత్రి తెలియజేయడం జరిగిందని అన్నారు. కొమురవెల్లి ఆలయ అభివృద్ధి భక్తుల సౌకర్యం కోసం సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్న మంత్రి కొండా సురేఖకి మహదేవన్ శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డైరెక్టర్ లింగంపల్లి శ్రీనివాస్, కొమరవెల్లి గ్రామ శాఖ అధ్యక్షులు లింగంపల్లి కనకరాజ్, మండల సెక్రెటరీ సార్ల లింగం, పిఎసిఎస్ డైరెక్టర్ బత్తిని నరసింహులు గౌడ్ ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏర్పుల రాజు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొచ్చు ఎల్లయ్య, టౌన్ అధ్యక్షుడు గుండ మహేష్, మండల సెక్రటరీలు ఉప్పల వంశీ, ఇనిశెట్టి కిరణ్, మండల సోషల్ మీడియా యూత్ కోఆర్డినేటర్ కోయడ ప్రశాంత్, కొమురవెల్లి గ్రామ శాఖ ఉపాధ్యక్షులు గొదల నవీన్ పాల్గొన్నారు.



ఢిల్లీ బాంబు బ్లాస్ట్ కేసులో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్స్‌తో సంబంధమున్న అందరినీ కఠినంగా శిక్షించాలి. అదే సమయంలో అమాయక పౌరులను వేధించొద్దు. ప్రతి కశ్మీరీ ముస్లింని అనుమానించొద్దని నార్త్ జోన్ సీఎంల సమావేశంలో కోరాను. పేలుళ్ల నేపథ్యంలో కశ్మీరీ పౌరులను టెర్రరిస్టు సింపథైజర్లుగా భావించరాదు.
- జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

మార్కెట్ చుట్టూ దుకాణ సముదాయాల నిర్మాణం



- దారిద్ర్యారేకకు దిగువన ప్రజలకు సన్నబియ్యం కాంగ్రెస్ ఘనత
- ఎంతోకాలంగా ఎదురుచూసిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు
- జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 18: గజ్వేల్ మార్కెట్ సంస్థకు ఆదాయం చేకూర్చడం కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ చుట్టూ దుకాణ నిర్మాణాలకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 3 కోట్ల మంజూరి ఇచ్చారని సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమలు, గనుల, భూ గర్భశాస్త్ర శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో 1 కోటి 5 లక్షలతో క్రొత్త పత్తి మార్కెట్ నిర్మాణానికి, కాంపౌండ్ వాల్, మూడు కోట్లతో సమీకృత మార్కెట్ గజ్వేల్ నందు దుకాణ సముదాయాల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి జీ. వివేక్ వెంకట స్వామి పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమం ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ప్రజాపాలన ద్వారా ప్రజలకు మేలు చేయాలనే ఆలోచకతో "ఆరు" గ్యారంటీల అమలుకు ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులను అందజేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ లేనటువంటి దారిద్ర్యారేకకు దిగువన ప్రజలకు 12వేల కోట్లతో సన్న బియ్యం అందజేసే కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం 10 సంవత్సరాల నుండి ఎదురుచూసిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశా నిర్మాణంలో ఉన్నాయి. నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను ఆదేశించారు. మలిదశలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.అసలైన లబ్ధిదారులకు ఇల్లు కట్టించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సన్న బియ్యం బోనస్ కోసం రైతులు అందరూ ఎదురు చూస్తున్నారని అతి త్వరలో రైతుల అకౌంట్లో బోనస్ నిధులు మంజూరు చేయబోతునట్లుతెలిపారు. ప్రజలు, అధికారులు, అందరూ సహకారంతో అన్ని సంక్షేమ పథకాలను అందించడం కోసం అదనపు నిధులు సైతం ముఖ్యమంత్రి తో మాట్లాడి నిధుల మంజూరి చేయిస్తానని తెలిపారు.

బస్టాండ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి: ఎమ్మెల్సీ యాదవ రెడ్డి

గజ్వేల్, ప్రజ్ఞాపూర్ లో రెండు బస్టాండ్ పనులు చివరి దశలో ఉన్నాయని వాటి పైన దృష్టి సారించి పూర్తి చెయ్యాలనీ, మరియు గజ్వేల్ రింగ్ రోడ్ భూ సేకరణతో కొంత నిర్మాణంలో జాప్యం జరిగిందని వాటికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేసి రింగ్ రోడ్డు పనులు పూర్తి చెయ్యాలని, ఆయా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ లపై దృష్టి సారించాలని మెదక్ ఎమ్మెల్సీ యాద రెడ్డి మంత్రికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి, గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, ఆర్డీఓ చంద్రకళ, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సర్దార్ ఖాన్, కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.



నషా ముక్త్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలి

- మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 18: మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు రావాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయ ప్రాగణంలో జిల్లా పోలీస్ సిబ్బంది అధికారులతో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉంటానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని, సమాజంలో ఎవ్వరూ మాదకద్రవ్యాల బారిన పడకుండా కృషి చేస్తానని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అంకితభావంతో పనిచేస్తానని పోలీస్ సిబ్బందితో కలసి ప్రమాణం చేశారు. అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ ఏ ఒక్కరు కూడా డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేయాలన్నారు. ఈ మాదకద్రవ్యాల ప్రభావం వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని, అందుకే పోలీస్ వ్యవస్థతో పాటు ప్రతి పౌరుడు అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. భారతదేశం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలంటే యువతను డ్రగ్స్ ముప్పు నుండి రక్షించడం మొదటి అడుగు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్,ఏఆర్ డియస్పి. రంగా నాయక్, ఏఓ మణి ,ఆర్ఐ శైలందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్.కృష్ణ మూర్తి,ఎసైలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపునకు పటిష్ట ప్రణాళిక

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- అధికారులతో సమీక్ష నిర్వహించిన ఇంచార్జి కలెక్టర్

ప్రతిపక్షం రాజన్న సిరిసిల్ల, నవంబర్ - 18: ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంపునకు పటిష్ట ప్రణాళిక అమలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాల సాధనపై ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. దేశ అవసరాలకు సరిపడా వంట నూనె మన దగ్గర పండటం లేదని, విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని, దీనివల్ల దేశానికి కోట్లలో నష్టం వస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ పెరగడం వల్ల రైతులకు అధిక లాభం జరగడంతో పాటు దేశానికి కూడా ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ పంట విస్తరణ కోసం ప్రభుత్వం అనేక సబ్సిడీలను అందిస్తుందని, రైతులకు అంతర్ పంటల ద్వారా మొదటి మూడు సంవత్సరాలు ఆదాయం లభిస్తుందన్నారు. జిల్లాలో 202526 ఆర్థిక సంవత్సరానికి 4 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు విస్తీర్ణం లక్ష్యమని తెలిపారు. జిల్లాలో ఉన్న 24 పీఏసీఎస్ ల ద్వారా ఒక్కో పీఏసీఎస్ కు 120 ఎకరాలు, ఉద్యానవన శాఖ అధికారులకు వంద ఎకరాలు, వ్యవసాయ శాఖ ఏఓ లకు 20 ఎకరాలు, ఏఈవో లకు 10 ఎకరాలు లక్ష్యం సాధించాలని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తిగా ఉన్న రైతుల రిజిస్ట్రేషన్, పరిపాలన మంజూరు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్న రైతుల వద్ద నుంచి మొక్కలు, డ్రిప్ ఏర్పాటుకు రైతుల వాటా డీడీలను సేకరించి సంబంధిత ఏజెన్సీల ద్వారా డ్రిప్ సౌకర్యం సత్వరమే అందేలా చూడాలని, నిర్దేశిత లక్ష్యం ప్రకారం ఆయిల్ పామ్ సాగు ప్లాంటేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. జూలై నుంచి ఇప్పటిదాకా 67 మంది రైతుల నుంచి 257 ఎకరాల్లో 110 టన్నులు సేకరించి, రూ.19,681 టన్నుకు మద్దతు ధర వచ్చిందని, ప్రీ యూనిక్ కంపెనీ సేకరించడం జరిగిందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కంపెనీ ఉందని, రైతులకు పంట విక్రయించేందుకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ పంట సాగుతో లాభాలు, సాగు విధానం, మద్దతు ధర, తదితర అంశాలపై రూపొందించిన కరపత్రాన్ని ఇంచార్జి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత, జిల్లా కో ఆపరేటివ్ అధికారి రామకృష్ణ, హార్టికల్చర్ అధికారులు వి.గోవర్దన్, లోకేష్, కంపెనీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ అన్నారు. మంగళవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన అర్బన్ నియోజకవర్గం స్థాయి కార్యకర్తల సమావేషానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ పార్టీ బలపడేది కార్యకర్తల అంకితభావం ద్వారానే అని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్షం, నిజామాబాద్



రామగుండంను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 18: రామగుండం పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్న నేపధ్యంలో మంగళవారం సాయంత్రం రామగుండంఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ బి పవర్ హౌస్ గడ్డ నుండి మొదలైన ప్రధాన రహదారి పర్యవేక్షణలో వెడల్పు రోడ్డు నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు,పురపాలక అధికారులు,ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది,కాంట్రాక్టర్లు ఈ పర్యవేక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు రోడ్డు వెడల్పు పనులను వేగవంతం చేస్తున్నాం. బి పవర్ హౌస్ గడ్డ నుండి పట్టణ కేంద్రం వరకు అభివృద్ధి చెందుతున్న ఈ ప్రధాన రహదారి ప్రజలకు ప్రయాణంలో సౌలభ్యం కలిగిస్తుంది.ట్రాఫిక్ సమస్యలు తగ్గి,ఆర్థిక కార్యకలాపాలు వేగంగా సాగేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు. అలాగే పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండదని అధికారులను ఆయన గట్టిగా హెచ్చరించారు.పనులను గడువులోపే పూర్తి చేయాలని, ప్రతిదశలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. పరిశీలన సందర్భం గా స్థానిక నివాసితులు తమ సమస్యలు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తో పంచుకున్నారు. వాటిని తీర్చే దిశగా తగిన చర్యలు తీసుకుంటా మని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీటి బాలరాజు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, స్థానిక ప్రజలు ఉన్నారు.



కలెక్టర్ కుమార్ దీపక్ కు జాతీయ అవార్డు


ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్ 18: మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఢిల్లీలో నీటి సంరక్షణ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మూ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్నారు. నీటి సంరక్షణ విభాగంలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు మంచిర్యాల జిల్లాకు చెందిన జెల్ సంజయ్ జెన్ భగీరథ నేషనల్ అవార్డు లభించింది. అవార్డు అందుకున్నందుకు జిల్లా అధికారులు, ప్రజలు హర్షం తెలియజేశారు.



బీసీలకు రిజర్వేషన్ బిల్లు కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

- జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రధానికి బహిరంగ లేఖ

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్ 18: మంచిర్యాల పట్టణంలో బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్ లో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం 42% బీసీలకు రిజర్వేషన్ బిల్లు రాజ్యాంగ సవరణ కోసం పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి బహిరంగ లేక రాశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నుండి ఇప్పటివరకు 130 సార్లు రాజ్యాంగ సవరణ చేశారన్నారు. అలాగే ఏ ఉద్యమం లేకుండా అగ్రకులాలకు భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ నూటమూడును ఐదు రోజుల్లో సవరణ చేసి పది శాతం ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. అనేక ఉద్య మాలు చేస్తూ బీసీలు ఎన్నో విజ్ఞప్తులు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్ ను గుర్తించి 42% రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేసి బిజెపి ప్రభుత్వం బీసీల పక్షాన నిలబడాలని కోరారు. లేనిపక్షంలో బీసీలందరూ రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మల శ్రీనివాస్, గజల్ వెంకటయ్య, అందే సంతోష్ కుమార్, ఎదునూరి రమేష్, మంచర్ల సదానందం, చంద్రమౌళి, అంకం సతీష్, శాకాపురం భీమేష్, పెద్దపల్లి సూరయ్య, నియాజ్, దుమ్మటి అర్జున్, జి సంతోష్, కార్య లచ్చన్న పాల్గొన్నారు.




పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఎమ్మెల్యే గంగుల ఆధ్వర్యంలో ఆందోళన
- పత్తి బస్తాలు మోస్తూ నిరసన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 18: రైతులు పండిరచిన పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, పత్తి పంటను సీసీఐ ద్వారా కొనే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన మరింత వృధృతం చేస్తామని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. పత్తి బస్తాలను నెత్తిమీద పెట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులు అరి గోస పడుతున్నారన్నారు. రేవంతు సర్కారు బై ఎలక్షన్ లో ఎలా గెలవాలి అని ఆలోచించారే తప్ప రైతుల గురించి ఆలోచించడం లేదన్నారు. రేవంత్ ఢిల్లీ మూటలు మోస్తున్నారు. కాని ఇక్కడి ప్రజల బాధలు చూడడం లేదని అన్నారు. రైతుల పత్తి కొనే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన మరింత వృధృతం చేస్తామని హెచ్చరించారు. పత్తి కొనుగోలు సెంటర్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే రైతాంగానికి వ్యతిరేకంగా ఉండే నిబంధనలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేరుగా కౌలు దారులకే పత్తి అమ్ముకునే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి క్వింటాలు 15 కింటాళ్ల వరకు పత్తి కొనుగోలు చేయాలని అన్నారు. పత్తి కొనుగోలు సిసిఐ సీలింగ్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవిఆర్, పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో ఆందోళన

పత్తి పంట ను సీసీఐ ద్వారా కొనే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన మరింత వృధృతం చేస్తామని హెచ్చరించారు. టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపుమేరకు పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాత నిబంధనలతోనే పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ రహదారిపై బి ఆర్ ఎస్ నాయకులు రాస్తా రోకో చేశారు. గంటపాటు చేసిన రాస్తా రోకో తో భారీగా వాహనాలు నిలిచాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు రైతులకు ఏలాంటి ఇబ్బంది లేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు అరి గోస పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ నిబంధన లతో సీసీఐ కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వన్ని చోరువా తీసుకోవాలని డిమాండ్ చేసారు..



బండ సురేందర్ రెడ్డికి ఏఐఎఫ్ బి నేతల నివాళులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 18: అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్ మృతి చెందడంతో, కరీంనగర్ పట్టణంలోని ఆయన నివాసానికి ఏఐఎఫ్ బి నాయకులు చేరుకుని నివాళులు అర్పించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, సూడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పుట్ట మధు, ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్, సుద్దాల దేవయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి పురామల్ల శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి వసుధవారెడ్డి, జిల్లా కార్యదర్శి పంజలా శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ లు బుమయ్య, నర్సయ్య, ఐలెందర్ యాదవ, ఏఐఎఫ్ బి రాష్ట్ర,జిల్లా నాయకులు ప్రసాద్, బుచ్చిరెడ్డి, అంబటి జోజిరెడ్డి, కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, కొండా దయానంద్, బండారి శేఖర్, ఇతర జిల్లాల కార్యదర్శిలు పాల్గొని నివాళులు అర్పించారు. సురేందర్ రెడ్డి భౌతికకాయంపై పూలమాల సమర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.



అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మి మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవద్దు. వచ్చే మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేస్తాం. మరో నాలుగు నెలలే ఉన్నందున నక్సల్స్ లొంగిపోవాలి. మావోయిస్టులు బుల్లెట్‌ను కాకుండా బ్యాలెట్‌ను నమ్ముకోవాలి. కేవలం పోలీసులు, సైనికుల చేతుల్లోనే తుపాకులు ఉండాలి.

-కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ప్రాంతీయం



ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 18: గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం రామగుండం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్శనలో ఆసుపత్రిలో జరుగుతున్న కొత్త భవన నిర్మాణం, వార్డుల ఆధునీకరణ, అత్యవసర సేవల విస్తరణ, పరిశుభ్రత-పర్యావరణ నిర్వహణ వంటి పలు అంశాలను అధికారులు సమీక్షించారు. అసుపత్రి మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ హర్ష ఈ సందర్భంగా పేర్కొన్నారు.రోగుల కోసం అవసరమైన పరికరాలు, సిబ్బంది,అత్యవసర సేవలను మరింత బలోపేతం చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సందర్శన కార్యక్రమం లో ఆసుపత్రి సూపరింటెండెంట్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వీరి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

భారతీయ సంస్కృతి, సనాతన ధర్మమే మన బలం

- సర్దార్ పటేల్ స్ఫూర్తితో విచ్ఛిన్న శక్తుల ఆట కట్టిద్దాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- సిరిసిల్లలో 'సర్దార్ 150@ యూనిటీ మార్చ్'



ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్18: రతీయ సంస్కృతి, సనాతన ధర్మమే మన బలం అని, భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు పాకిస్తాన్ వంటి ఉగ్రవాద దేశాలు కుట్ర చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సర్దార్ పటేల్ స్ఫూర్తితో నరేంద్రమోదీ ప్రభుత్వ ఆధ్వర్యంలో అందరం ఐక్యంగా ఉంటూ విచ్చిన్న శక్తుల ఆట కట్టించి దేశాన్ని ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. మన సంస్కృతి, సాంప్రదాయం, సనాతన ధర్మమే భారతదేశానికి బలమని, మన మట్టిలోనే ఆ బలం ఉందని అన్నారు. కుటుంబ రాజకీయ వారసత్వ రాజకీయాలతో దేశానికి ప్రమాదమని పేర్కొన్న కేంద్ర మంత్రి యువత రాజకీయాల్లోకి రావాల్సిన వచ్చి రాజకీయ సమీకరణలను మార్చాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా పాదయాత్రలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈరోజు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం మేరా భారత్ ఆధ్వర్యంలో "సర్దార్@150 యూనిటీ మార్చ్" పేరిట కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం మేరా భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా ఇంఛార్జీ కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ మహేశ్, అదనపు కలెక్టర్ నగేశ్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ మన దేశం ఐక్యంగా లేకపోతే పక్కనున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి ఉగ్రవాద దేశాలు మనలోని విభేధాలను వాడుకుని భారత దేశ ఐక్యతను దెబ్బతీసి విధ్వంసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. 2047లో భారత్ ను అన్ని విధాలా అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈ దేశానికి యువతే బలం. యువతతోనే దేశ ఐక్యత సాధ్యం. కాబట్టి యువత తప్పనిసరిగా రాజకీయాల్లోకి రావాలి. లేనిపక్షంలో కుటుంబ వారసత్వ రాజకీయాలే కొనసాగుతాయని అన్నారు. నేటి యువతకు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ ఆదర్శం, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. అలాంటి మహనీయుడిని 150 జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకునేలా, ఆయన సిద్ధాంతాలను కొనసాగించాలనే మహత్తర ఆశయంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు "సర్దార్@150 ఐక్యతా మార్చ్" పేరిట అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు.



మాదకద్రవ్యాల పై పోరాటంలో భాగస్వాములమవుదాం

- ప్రతిజ్ఞ చేయించిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 18: మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వాములమవుతామని రామగుండం నగర పాలక సంస్థ సిబ్బందిచే అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు" నషా ముక్త భారత్ అభియాన్"లో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళ వారం సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సామూహిక డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములమవు తామని విద్యార్థినీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి.రామన్,అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి,సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు,అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు,ఆర్ ఓ. ఆంజనేయులు,ఎసిపి శ్రీహరి, అక్కౌంట్స్ ఆఫీసర్ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం,సంపత్,ప్రభుత్వ పాఠశాల,కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి,సంజీవయ్య,వార్డు అధికారులు,మెప్మా,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల రహిత ప్రాంతంగా మార్చడమే లక్ష్యం

- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 18: వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేలా, రోడ్డు ప్రమాద రహిత ప్రాంతంగా మార్చాలానే సదుద్దేశంతో ప్రమాదాలు జరుగ కుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో భాగంగా రాత్రి వేళల్లో వాహన రాకపోకలు తగ్గించాలని, రోడ్ల పక్కన వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో రాత్రి సమయంలో ఆలస్యంగా, తెల్లవారుజామున వాహనాల ప్రయాణం కారణంగా చోటుచేసు కుంటున్న ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసు శాఖ, లా అండ్ ఆర్డర్ పోలీస్ సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్పరాత్రి ఆలస్యంగా ప్రయాణాలు చేయడం మానుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణ,ప్రజల ప్రాణాల రక్షణ, భద్రత మొదటి ప్రాధాన్యత అని రాత్రి వేళల్లో పర్యవేక్షణ, విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ విధులు,ట్రాఫిక్ ఎన్ఫోర్స్‌మెంట్ మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు సీపీ తెలిపారు.



నషా ముక్త్ భారత్ నిర్మాణానికి ప్రజల సహకారం ముఖ్యం

- ప్రతి ఒక్కరు పోరాటం చేయాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 18: మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా,అమ్మకం వంటి కార్యకలా పాలను పూర్తిగా అరికట్టే దిశగా ప్రభుత్వం చేపడుతున్న"నషా ముక్త భారత్"కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ప్రస్తుత సమాజాన్ని,యువత ను మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉంచడం కోసం ప్రజల సహకారం అత్యంత అవసరమని,ప్రతి ఒక్కరు బాధ్యత గా పోరాటం చేయాలని అన్నారు. మంగళవారం రామగుండంపోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు అధికారులు,సిబ్బంది, సీపీఓ సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని,సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని సీపీ పేర్కొన్నారు.డ్రగ్స్‌కుదూరంగా ఉండాలని,ఇతరులను కూడా దూరంగా ఉండేలా చైతన్యం కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచార అందించాలని అన్నారు. యువతలో అవగాహన పెంచేందుకుగాను స్కూళ్లు,కాలేజీ లలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను రామగుండం పోలీస్ కమీషనరేట్ లో నిర్వహించడం అదేవిదంగా గంజాయి అక్రమ రవాణా,నిల్వ, సరఫరా పై ప్రత్యేకంగా నిఘా పెట్టి వారిని పట్టుకోవడం అదేవిదంగా మత్తుకు బానిసలుగా మారి సేవించే వారిని పట్టుకొని తల్లితండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ కి నిర్వహించడం రిహాబ్లేటేషన్ సెంటర్లకు పంపించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్రగౌడ్, ఏవో శ్రీనివాస్,వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు రాజేంద్రప్రసాద్ చంద్రశేఖర్ గౌడ్,బాబురావు, నార్కోటిక్ వింగ్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్,ఆర్ ఐ లు శ్రీనివాస్ వామనమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సన్న వడ్ల బోనస్ వెంటనే చెల్లించాలి

- బీఆర్ఎస్ నేత మల్లికార్జున రెడ్డి

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 18: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సన్న రకం వడ్లు పండించిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన క్వింటాళ్లకు రూ.500 బోనస్ ఇప్పటికీ చెల్లించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. హుస్నాబాద్ సింగిల్ విండో పరిధిలో దాదాపు పది వేల క్వింటాళ్ల ధాన్యానికి బోనస్ ఇంకా పెండింగ్‌లో ఉండటం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆయన చెప్పారు. ఒకటి,రెండు పసళ్లు పూర్తయినా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం రైతులను మోసం చేసుడే అవుతుందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నాణ్యమైన గొనెసంచులు ఇవ్వకపోవడం, అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని తిరస్కరించడం, తడిసిన ధాన్యంలో 2 కిలోల తరుగు తీసి కొనుగోలు చేయడం వంటి సమస్యలతో రైతులు నష్టపోతున్నారని మల్లికార్జున రెడ్డి తెలిపారు. కొనుగోళ్ల వేగం లేకపోవడంతో రైతులు నష్టాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ధాన్యం అమ్ముకున్న రైతులకు పెండింగ్ చెల్లింపులు వెంటనే విడుదల చేసి, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొమ్మెర నర్సింహా రెడ్డి, మల్కిరెడ్డి మోహన్ రెడ్డి, పాకాల శ్యాముందర్, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 18 : నగరంలో కొద్ది రోజుల క్రితం ఖిల్లా రోడ్లో ఖాసిం న్యాయవాది పై హత్యాయత్నం చేసిన వారిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు మంగళవారం రెండవ టౌన్ ఎస్ఐ సయ్యద్ ముజాహిద్ తెలిపారు. న్యాయవాలు పై హత్యాయత్నం చేసిన అర్షద్ ఖాన్ అతని కొడుకులు ముజాహిద్ ఖాన్ ముజఫర్ ఖాన్ లపై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కాగా, అప్పటినుండి ముగ్గురు తప్పించుకు తిరుగుతున్నారని తెలిపారు. మంగళవారం విశ్వసనీయమైన సమాచారం మేరకు అర్షద్ ఖాన్ అతని కొడుకు ముజాహిద్ ఖాన్ లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుచగా కోర్టు వారిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో మరొకరు పరారీలో ఉన్నారని, అతని కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రజల గోడు పట్టని బీజేపీ ప్రభుత్వం

- సీపీఐ బస్సు యాత్రలో సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 18: దేశ సంపద నంత బడా వ్యాపారులకు కట్టబెట్టి భారతదేశ ప్రజలపై పన్నుల భారం మోపి అదాని, అంబానీ కార్పొరేట్ కంపెనీల పెట్టుబడి దారులకు దోచి పెడుతున్నారని బీజేపీ ప్రభుత్వ పనితీరుపై సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. హుస్నాబాద్ కు బస్ యాత్ర వచ్చిన సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ అధికారం, పదవులు ఉన్నా, లేకున్నా ప్రజల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఐ ఒక్కటేనని అన్నారు. మావోయిస్టు నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు నేతలను బుటకపు ఎన్కౌంటర్ చేసి చంపడం బీజేపీ ప్రభుత్వానికి తగదని చాడ వెంకటరెడ్డి అన్నారు.సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ 2014లో బీజేపీ ప్రభుత్వ ప్రతి కుటుంబానికి 15 లక్షాలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చెస్తామని, ధరలు తగ్గించి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాయా మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువులపై అధిక ధరలను పెంచి, ప్రభుత్వం రంగం సంస్థలను ప్రయివేటు కట్టబెట్టిన బీజేపీ ప్రభుత్వ పనితీరుపై ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తెలుగు, మలయాళ ఇండస్ట్రీలకు చెందిన దిగ్గజాలు మహేశ్, పృథ్వీరాజ్‌తో కలిసి రాజమౌళి మూవీలో పనిచేయడం గొప్ప గౌరవం. మా సినిమా విడుదలకు ఏడాది ముందే అంతర్జాతీయ మీడియాతో ప్రమోట్ చేస్తున్నాం. మూవీపై పెరిగిన అంచనాలు మాలో మరింత ఉత్సాహాన్ని పెంచాయి. దేవుడి దయతో మీ అంచనాలను అందుకుంటాం.. జై శ్రీరామ్'.

- 'వారణాసి' హీరోయిన్ ప్రియాంకా చోప్రా



మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత నడుం బిగించాలి

- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 18: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో 'నషా ముక్త భారత్' కార్యక్రమం భాగంగా బుధవారం హుస్నాబాద్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ సాగింది. 'సే నో టూ డ్రగ్స్ సే ఎస్ టూ లైఫ్' అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు ప్రజలను మాదక ద్రవ్యాల చెర నుండి దూరంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ... యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. మాదకద్రవ్యాలు యువత జీవితాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని, వాటి నివారణకు సమాజం మొత్తం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువత పెద్ద సంఖ్యలో మాదకద్రవ్య వ్యతిరేక ప్రచారంలో పాల్గొనడం అత్యవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మా రెడ్డి, సింగిల్ విండో చైర్‌పర్సన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, మాజీ కౌన్సిలర్ వల్లపు రాజు, పున్న సది, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సెయింట్ జోసెఫ్, గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం

- సివిల్ సప్లై అధికారితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు
- రెండుసార్లు ఏసీబీకి చిక్కి, ఒకసారి సస్పెండ్ అయినా తీరు మార్చుకోని యాకూబ్ పాషా





ప్రతిపక్షం, ఇల్లందు, నవంబర్ 18: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందులో మధ్యవర్తి ద్వారా రేషన్ డీలర్ నుండి 30 వేల రూపాయలు లంచం తీసుకుంటూ సివిల్ సప్లై అధికారితో పాటు మరో ఇద్దరు ఏసీబీకి చిక్కారు. ఇల్లందు, టేకులపల్లి మండలాల సివిల్ సప్లై అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న యాకూబ్ పాషా ఇల్లందులోని ఓచౌక దుకాణ డీలర్ ను 30 వేల రూపాయలు డిమాండ్ చేసి గత కొన్ని రోజులుగా మధ్యవర్తుల ద్వారా ఒత్తిడి తీసుకొస్తూ ఇబ్బందులకు గురిచేశాడు. యాకూబ్ పాషా ఇల్లందు మండల రేషన్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరీస్ ను మధ్యవర్తిగా నియమించుకొని డబ్బులు వసూలు చేసేటువంటి ప్రక్రియ ప్రారంభిస్తున్నాడు. ఇదే క్రమంలో యాకూబ్ పాషా ఆదేశాల మేరకు సివిల్ సప్లై టెక్నీషియన్ అసిస్టెంట్ విజయ్, డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు శబరిస్ తోటి డీలర్ ను డబ్బుల కోసం గత కొన్ని రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధిత డీలర్ ఏసీబీని ఆశ్రయించగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి శబరిస్కు డీలర్ డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండుగా పట్టుకున్నారు. దీంతో సివిల్ సప్లై అధికారి యాకూబ్ పాషతోపాటు శబరిస్కు, టెక్నీషి అసిస్టెంట్ విజయ్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సివిల్ సప్లై అధికారి యాకుబ్ పాషా 2011లో ఖమ్మం జిల్లా, కొనిజర్లలో ఏసీబీకి చిక్కాడు. 2014 లో అవినీతికి పాల్పడినందున సస్పెండ్ అయ్యాడు. సివిల్ సప్లై అధికారి పరిధిలో ఉన్నటువంటి సంస్థల పై ఇలాంటి పర్యవేక్షణ లేదు. ఇంత అవినీతికి పాల్పడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయటంలో తన పాత్రను పోషిస్తున్న యాకూబ్ పాషా ను ఉద్యోగం నుండి పూర్తిగా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈసీ తన విశ్వసనీయతను నిరూపించుకోవాలి

- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే డిమాండ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 18 : తాము జేపీ కనుసన్నలలో పనిచేయడం లేదని కేంద్ర ఎన్నికల సంఘం నిరూపించుకోవాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఈసీ ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ తీవ్ర అభ్యంతరకంగా ఉందని ఆరోపించారు. ఓట్ల చోరీకి పాల్పడేందుకు ఆయుధంగా దీనిని ఈసీ దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ జరుగుతున్న 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఆఫీస్ బేరర్లతో మంగళవారం ఢిల్లీలో ఖర్గే భేటీ అయ్యారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సమగ్రత దెబ్బ తినకుండా చూడటానికి తాము కట్టుబడి ఉంటామన్నారు. ప్రజాస్వామిక సంస్థలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతున్న వేళ, ఈసీ ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహిస్తున్న తీరు చాలా బాధ కలిగించేలా ఉందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ కనుసన్నలలో తాము పనిచేయడం లేదని వెంటనే నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఏ అధికార పార్టీకీ తలొగ్గకుండా, కేవలం భారత ప్రజలకు విధేయతగా ఉంటామని చేసిన రాజ్యాంగ ప్రమాణాన్ని ఈసీ గుర్తుంచుకోవాలన్నారు. ఓట్లచోరీకి పాల్పడేందుకు ఒక అస్త్రంగా ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ వాడుకుంటోందని తాము బలంగా నమ్ముతున్నామన్నారు. ఒకవేళ ఈసీ ఈ దారినే ఎంచుకొని ఉంటే, ఓ తప్పుకు ఈసీ మౌనంగా సహకరిస్తున్నట్లు భావించాల్సి వస్తుందని ఖర్గే చెప్పారు.



విశ్వ వీక్షణం



నేను ఓ 'బలిదాన' ఆపరేషన్ చేస్తున్నా

- తన చివరి వీడియోలో డా. ఉమర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 18 : ఎర్రకోట ప్రాంతంలో ఈ నెల పదిన జరిగిన భీకర కారు పేలుడు ఘటనలో అభిస్తున్న ప్రతి క్లూ దర్యాప్తును కీలక దశకు తీసుకెళ్తోంది. తాజాగా దాడికి కొన్ని క్షణాల ముందు ఉమర్ ఉన్ నబీ రికార్డ్ చేసిన అన్‌సీన్ వీడియో బయటకు వచ్చింది. ఇందులో ఆత్మాహుతి దాడిని 'తప్పుగా అర్థం చేసుకున్న కాన్సెప్ట్' అంటూ, దానిని బలిదాన ఆపరేషన్‌గా చూపించే ప్రయత్నం చేశాడు ఉమర్. ఉగ్రవాద సిద్ధాంతాల ప్రభావంలో ఉన్నట్లు స్పష్టంగా కనిపించే ఆ వీడియోను పోలీసులు బ్లాస్ట్ జరిగిన తరువాత స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఉమర్ మాట్లాడిన మాటలు అతను దాడి ముందు ఉన్న మానసిక స్థితిని, తీవ్రవాద గ్రూపుల ప్రభావాన్ని బయటపెడుతున్నాయి. 'ఆత్మాహుతి దాడిపై సమాజంలో పలు రకాల వాదనలున్నాయి. ఆత్మాహుతి దాడి చేసుకోవాలని చూసేవాడు భయంకర మైండ్‌సెట్‌కు వెళ్లాల్సి ఉంటుంది. చావే అంతిమ లక్ష్యమని కూడా నిర్ణయించుకోవాలి. నిజానికి, అలాంటి ఆలోచనను ఈ సమాజం ఒప్పుకోదు' అని ఉమర్ వీడియోలో వ్యాఖ్యానించాడు. అతని మాటల తీరు చూస్తే, బ్లాస్ట్‌కు కొద్దిసేపు ముందే రికార్డ్ చేసిన వీడియో అనేది స్పష్టమవుతోంది. ఈ వీడియోతో పాటు సీసీ టీవీ ఫుటేజ్, ఇతర డిజిటల్ ఆధారాలు ఆధారంగా ఉమర్ ప్రయాణం ఎలా సాగిందో, దాడి టైమ్‌లైన్ ఎలా అమలైందో అధికారులు వివరంగా నమోదు చేస్తున్నారు. పుల్వామాకు చెందిన ఈ 28 యేండ్ల డా. ఉమర్ ఉన్ నబీ, వైట్ కాలర్ ప్రొఫైళ్లు కలిగిన తీవ్రవాద మాడ్యూల్‌లో భాగమని విచారణలో బయటపడుతోంది. పేలిన కార్‌ను నడిపింది ఉమరేనని అధికారికంగా ధృవీకరించారు. పేలుడుకు గంటల ముందే ఫరీదాబాద్‌లో పోలీసులు 2,900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు డాక్టర్లు అరెస్టు అయ్యారు. ఈ నెట్‌వర్క్ కాశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వరకు విస్తరించినట్లు తెలుస్తోంది.

సింగిడి
హైదరాబాద్
బుధవారం
19.11.2025
11
ప్రతిపక్షం
Prathipaksham.in



చలికాలంలో చర్మంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది రకరకాల బ్యూటీ ప్రాడక్ట్స్ వాడుతుంటారు. ఇవి మీ చర్మానికి కూడా హాని కలిగించవచ్చు. సహజంగా మెరిసే చర్మాన్ని పొందాలనుకుంటే, శీతాకాలంలో లభించే కొన్ని సూపర్‌ఫుడ్‌ల తెలుసుకోండి.

వింటర్‌లో హెల్దీ స్కిన్ కోసం...

చలికాలం అనేక వ్యాధులను తెచ్చిపెడుతుంది. ఈ సమయంలో మనం మన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చలి కాలంలో మన ఆరోగ్యంతో పాటు చర్మంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి కొద్దిపాటి అజాగ్రత్త వల్ల కూడా చర్మం పొడిబారడంతోపాటు మెరుపును కోల్పోతుంది. వయసు పెరిగే కొద్దీ చర్మం మెరుపు కూడా తగ్గుతుంది. అటువంటి పరిస్థితిలో, చర్మానికి మేలు చేసే వాటిని ఆహారంలో చేర్చుకోవడం చాలా ముఖ్యం. చర్మాన్ని లోపలి నుండి పోషణ చేయడానికి, సరైన ఆహారం తీసుకోవాలి. చలికాలంలో చర్మాన్ని సంరక్షించుకోవడానికి ఆహారంలో ఏయే అంశాలను చేర్చుకోవాలో చూద్దాం.

పోషకాలు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లకు చలికాలం మంచి సీజన్. మరి చలికాలంలో అధికాంగా దొరికే వీటిని ఆహారంలో చేర్చుకుంటే ఆరోగ్యంతో పాటు చర్మ సంరక్షణ కూడా చేసుకోవచ్చు. వీటిలో, చర్మానికి మేలు చేసే కొన్ని సూపర్‌ఫుడ్‌లు ఉన్నాయి.

అవకాడో

అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఇ మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి చర్మాన్ని లోపలి నుండి తేమగా మారుస్తాయి. దీన్ని తినడం వల్ల ముడతలు తగ్గుతాయి. మీరు చల్లని రోజుల్లో స్మూతీ, సలాడ్ లేదా బ్రెడ్ స్ప్రెడ్ రూపంలో అవోకాడో తినవచ్చు. మీరు దీన్ని మాష్ చేసి ఫేస్ మాస్క్‌గా కూడా అప్లై చేసుకోవచ్చు.



క్యారెట్



క్యారెట్లు మీ చర్మానికి అంతర్గత కాంతిని అందిస్తాయి. ఇందులో బీటా కెరోటిన్ ఉంటుంది, ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది మరియు మీ చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. క్యారెట్లను పూర్తిగా తింటే, మీరు మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు.

ఉసిరి

చలికాలంలో ఉసిరిని అందరూ ఇష్టపడతారు. ఇది ఔషధ గుణాలతో నిండి ఉంది. మీరు దీన్ని చట్నీ, మురబ్బా, ఊరగాయ లేదా సాదా రూపంలో కూడా తినవచ్చు. ఉసిరికాయను ఖాళీ కడుపుతో తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఉసిరికాయ జుట్టు మరియు చర్మానికి చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. ఇలా చేయడం వల్ల ముఖం గ్లో పెరగడమే కాకుండా మచ్చలను కూడా దూరం చేసుకోవచ్చు.



వాల్ నట్స్

వాల్ నట్స్ లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఇ మరియు జింక్ పుష్కలంగా ఉన్నాయి. మనం రోజూ వాల్‌నట్‌లను తింటే, అది మన చర్మానికి ఎంతో పోషణనిస్తుంది. అలాగే చర్మం తేమను కాపాడుతుంది. మీరు వాల్‌నట్‌లను చిరుతిండిగా కూడా తినవచ్చు.



పాలకూర

చలికాలంలో పాలకూర పుష్కలంగా లభిస్తుంది. ఐరన్, ఫోలేట్, విటమిన్ ఎ, సి మరియు ఇ వంటి అనేక పోషకాలు ఇందులో లభిస్తాయి. ఇది చర్మాన్ని యవ్వనంగా మరియు ఆరోగ్యంగా ఉంచడానికి అవసరమైన పోషణను అందిస్తుంది. పాలకూర పులుసు లేదా పరాటా తయారు చేసి తినవచ్చు.



పోలీసుల అదుపులో జసీర్ బిలాల్

- ఉమర్ నబీతో కలిసి ఉగ్రవాద కుట్రలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 18 : ఢిల్లీ బాంబు పేలుడు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దాడిలో డాక్టర్ ఉమర్‌కు సహకరించిన జసీర్ బిలాల్ వాని అలియాస్ డానిష్ అనే వ్యక్తిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. ఇతను ఉమర్ నబీతో కలిసి ఉగ్రవాద కుట్రలకు పాల్పడినట్టి అధికారులు గుర్తించారు. పేలుడు కోసం సాంకేతికంగా పరికరాలను సహాయం చేయడంతో పాటు దాడి సమయంలో బాంబ్ పేలుడును డ్రోన్ల ద్వారా ఆపరేట్ చేసినట్టు అనుమానిస్తున్నారు. డానిష్ రాకెట్లను కూడా తయారు చేసేవాడని గుర్తించారు.



జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని ఖాజిగుండ్‌కు చెందిన డానిష్ ఈ దాడిలో కీలకంగా వ్యవహరించాడని అధికారులు పేర్కొన్నారు. దాడికి ముందు డ్రోన్‌లను సవరించడం, రాకెట్‌లను నిర్మించడంలో జాసిర్ సాంకేతిక సహాయాన్ని అందించాడని దర్యాప్తులో తేలింది. ఇతను ఉగ్రవాది ఉమర్ నబీతో కలిసి ఈ మారణహోమానికి ప్లాన్ చేసినట్టు తెలుసుకున్నారు. ఇక పక్కా సమాచారంతో అతన్ని జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సోమవారం అరెస్ట్ చేశారు. ఇతన్ను అరెస్ట్ చేసినట్టు ఎన్ఐఏ అధికారులు ప్రకటించారు. ఇక ఈ ఉగ్రదాడి వెనుక ఉన్న కుట్రను ఛేదించడానికి అధికారులు అన్ని కోణాలలో దర్యాప్తును వేగవంతం చేశారు. ఉగ్రదాడిలో పాల్గొన్న ప్రతి వ్యక్తిని గుర్తించడానికి దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహిస్తున్నారు. అనుమానం ఉన్నవారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మా తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తున్నారు

- లాలు పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 18 : తేజస్వి యాదవ్ సహాయకులు తమ కుటుంబాన్ని, పార్టీని ముక్కలు చేస్తున్నారని, అలాంటి ద్రోహులతో తమ తల్లిదండ్రులు మానసిక వేధింపులకు గురవుతున్నారని లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిమీద దర్యాప్తునకు ఆదేశించాలని ప్రధానమంత్రి మోడీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. లాలు కుటుంబంలో చీలికల నేపథ్యంలో తేజ్ ప్రతాప్ యాదవ్ స్పందించారు.




ముఖస్తుతి చేసేవారి కుట్రపూరిత రాజకీయాలతో ఆర్జేడీని బలమైన పార్టీగా మార్చడానికి ఎన్నో యేండ్లు కష్టపడిన వారిని విస్మరిస్తున్నారని ఆరోపించారు. దురాశ, అహంకారంతో విర్రవీగుతున్న తేజస్వి సహాయకులు తన తల్లిదండ్రులు లాలు ప్రసాద్, రబ్రీదేవిలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిసిందని అన్నారు. తన తండ్రి ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈ పరిస్థితులలో వారు ఒత్తిడిని తట్టుకోలేరని అన్నారు. ఈ విషయంపై దర్యాప్తునకు ఆదేశించాలని ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా, బీహార్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని అన్నారు. తాను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నానని, కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నానని లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య అన్నారు. ఆర్జేడీ ఎంపీ సంజయ్ యాదవ్, తేజస్వి మిత్రుడు రమీజ్ ఖాన్ కారణంగానే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. అనంతరం లాలూ మరో ముగ్గురు కుమార్తెలు కూడా పాట్నాలోని ఆయన ఇంటి నుంచి ఢిల్లీకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో తన కుటుంబంలో జరుగుతున్న గొడవలకు తేజస్వి సహాయకులే కారణమని తేజ్ ప్రతాప్ యాదవ్ ఆరోపిస్తున్నారు.

బంగ్లాదేశ్ లో పరాకాష్టకు చేరిన ప్రతీకారం

- మళ్లీ ఆ దేశంలో మిన్నంటుతున్న నిరసనలు

ఢాకా (బంగ్లాదేశ్), నవంబర్18 : మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు బంగ్లాదేశ్ కోర్టు మరణశిక్ష విధించడం దేశంలో సరికొత్త రాజకీయ పరిణామాలకు దారితీసింది. భారతదేశంలో తలదాచుకున్న ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కోరుతోంది. గత ఆగస్టు నుంచి షేక్ హసీనా మన దేశంలో ఉంటున్నారు. నిజానికి ఇంగ్లాండ్ దేశానికి శరణార్థిగా వెళ్లడానికి ఆమె దరఖాస్తు చేసుకున్నారు. అక్కడి ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. దీంతో ఆమె భారతదేశంలోనే ఉండిపోయారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ లో విపరీతంగా అల్లర్లు చోటుచేసుకుంటున్నాయి. తాత్కాలిక యూనస్ ప్రభుత్వం మీద అక్కడి ప్రజలలో నమ్మకం పోయింది. పోలీసులకు విస్తృతమైన అధికారాలు ఇవ్వడం ప్రజలకు నచ్చడం లేదు. దీనికి తోడు అవినీతి పెరిగిపోయింది. అంతర్జాతీయ నోబెల్ బహుమతి సాధించిన యూనస్ పరిపాలన విషయంలో పట్టు సాధించలేకపోతున్నారు. దీంతో ప్రజలకు ఉన్న ఆశలు అడియాసలు అవుతున్నాయి. అక్కడి ప్రజలు వీధులలోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. పాలనలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి యూనస్ ప్రభుత్వం చేయని పని అంటూ లేదు. అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారి బంగ్లాదేశ్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా అమెరికాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అయితే ఇది అక్కడి ప్రజలకు ఏమాత్రం నచ్చడం లేదు. దీంతో హసీనా ప్రస్తావన మళ్లీ అక్కడ వస్తోంది.



వన్డే సిరీస్ కు సిద్ధమవుతున్న టీమిండియా

- తుది జట్టులోకి రానున్న విరాట్, రోహిత్

సౌతాఫ్రికాతో రెండో టెస్టు ముగిసిన వెంటనే టీమిండియా వన్డే సిరీస్ ఆడుతుంది. నవంబర్ 30న రాంచీలో తొలి మ్యాచ్ ఉంటుంది. గౌహతిలో రెండో టెస్ట్ శనివారం మొదలై బుధవారం ముగుస్తుంది. ఆ తరువాత వన్డే సిరీస్ ఆడే భారత జట్టును బీసీసీఐ ప్రకటించనుంది. స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తిరిగి భారత జట్టులోకి రానున్నారు. పాండ్యా ఆడడం అనుమానంగా ఉంది. ఆసియా కప్ సందర్భంగా గాయపడిన పాండ్యా ఆస్ట్రేలియా పర్యటనకు కూడా దూరంగా ఉన్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకుని. ఇప్పుడు బెంగళూరు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్ నెస్ కొరకు శ్రమిస్తున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పాండ్యా ఆడే అవకాశాలున్నాయి. 26న జరిగే మొదటి మ్యాచ్ లేదా 28న జరిగే రెండో మ్యాచ్‌లో బరోడా తరపున హార్దిక్ బరిలోకి దిగుతాడని అంటున్నారు. పాండ్యా, అయ్యర్ మినహా ఆసిస్ పర్యటనకు వెళ్లిన వన్డే జట్టులో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. వన్డే సిరీస్ ముగిసిన వెంటనే ఐదు టీ20ల సిరీస్ జరుగుతుంది. వన్డే సిరీస్ నుంచి పాండ్యాతో బుమ్రాకు విశ్రాంతి ఇచ్చే అవకాశాలున్నాయి. మెడ నొప్పితో బాధపడుతున్న శుభ్‌మన్ గిల్ ను కొనసాగిస్తారా? అనేది కూడా సందేహమే. ఒకవేళ గిల్ ఆడకపోతే రోహిత్ శర్మ జట్టును సారథ్యం వహించవచ్చు. ఎందుకంటే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా గాయంతో జట్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ ఆడవచ్చు. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్‌లో ముగ్గురికి మాత్రమే అవకాశం ఉంటుంది. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆడవచ్చు. శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డిలో ఒకరు ఆడే అవకాశాలు ఉన్నాయి.



ఆర్సీబీని కొనుగోలు చేయనున్న 'హోంబాలే ఫిల్మ్స్'

- జాతీయ మీడియాలో విస్తృతంగా కథనాలు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును 'హోంబాలే ఫిల్మ్స్ ప్రొడక్షన్ హౌస్' కొనుగోలు చేసిందని సమాచారం. అధికారికంగా ప్రకటన రాకపోయినా ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. పూర్తిగా కాకపోయినా 'హోంబాలే సహయజమానిలా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ప్రస్తుతం డియాజియో ఇండియా ఆర్‌సీబీకి యజమానిగా ఉంది. గత సీజన్ ముగిసిన వెంటనే ఫ్రాంచైజీని అమ్మకానికి పెట్టినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఫ్రాంచైజీ విలువ సుమారు రెండు బిలియన్ అమెరికా డాలర్లుగా(రూ.17000 కోట్లు) ఉంటుందని అంచనా. డియాజియో కంపెనీ ప్రధానంగా మద్యం వ్యాపారం చేస్తుంది. దానికి అమెరికా అతిపెద్ద మార్కెట్. అక్కడ సుంకాలు పెరగడం, వినియోగదారులు కూడా తగ్గడంతో మద్యం అమ్మకాలపై ప్రభావం పడిం సంస్థ ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఆర్‌సీబీ ఫ్రాంచైజీని అమ్మడం ద్వారా వచ్చే డబ్బులను మద్యం వ్యాపారంపై పెట్టాలని డియాజియో భావిస్తోందని అంటున్నారు. 'కేజీఎఫ్' 'కాంతార'తో పాటు సలార్ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన హోంబాలే ఫిల్మ్స్ ఇప్పటికే ఆర్‌సీబీకి డిజిటల్ పార్ట్‌నర్‌గా ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తి అవుతుందని ఆర్‌సీబీ జట్టు అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ కన్నడ నిర్మాత విజయ్ కిరగందూర్, చలువే గౌడ 'హోంబాలే'ను 2012లో ప్రారంభించారు. కేజీఎఫ్, కాంతార, సలార్ వంటి పాన్ ఇండియా చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. 2023లో ఆర్‌సీబీ డిజిటల్ పార్ట్‌నర్‌గా రావడంతో మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది.



సన్‌రైజర్స్ హైదరాబాద్ సారథి అతడే

- కమిన్స్ ను మార్చేది లేదన్న జట్టు యాజమాన్యం

ఐపీఎల్ కొత్త సీజన్ కు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కొత్త కెప్టెన్ వచ్చే అవకాశాలు లేవని తేలిపోయింది. వచ్చే సీజన్‌లోనూ ప్యాట్ కమిన్స్ కెప్టెన్‌గా ఉంటారంటూ జట్టు యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్టును అధికారికంగా పంచుకుంది. దీంతో ఇక కమిన్స్‌కు వరుసగా మూడో సీజన్ కు కూడా సారథ్యం వహించనున్నాడు. కమిన్స్ ను 2024 ఐపీఎల్ సీజన్‌కు ముందు కెప్టెన్‌గా నియమించారు అంతకు ముందు దక్షిణాఫ్రికా ప్లేయర్ ఎయిడెన్ మార్‌క్రమ్ సారథిగా ఉండేవాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్, 2023 వన్డే వరల్డ్ కప్ విజయాల తర్వాత 2024లో కమిన్స్‌ను సన్‌రైజర్స్ ఏకంగా రూ. 20.50 కోట్లకు కొనుగోలు చేసింది. ఎస్ఆర్‌హెచ్‌లో చేరడానికి ముందు ప్యాట్ కమిన్స్ కేకేఆర్, డీసీ తరపున కూడా ఆడాడు. అయితే, కమిన్స్ ప్రస్తుతం గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. వెన్నునొప్పి కారణంగా అతను పెర్త్‌లో నవంబర్ 21న ప్రారంభమయ్యే తొలి యాషెస్ టెస్టు నుంచి అధికారికంగా తప్పుకున్నాడు. డిసెంబర్ నాలుగున బ్రిస్బేన్‌లో ప్రారంభమయ్యే రెండో టెస్టు సమయానికి అతను తిరిగి జట్టులోకి వస్తాడని చెబుతున్నారు. స్టీవెన్ స్మిత్ యాషెస్ తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు నాయకత్వం వహించే అవకాశాలు ఉన్నాయి.



నేనేమైనా హర్మన్‌ప్రీత్ కౌర్ నా?!

- బంగ్లా కెప్టెన్ నిగర్ సుల్తానా సంచలన వ్యాఖ్యలు

పాకిస్తాన్ సరసన బంగ్లాదేశ్ మహిళా క్రీడాకారులు కూడా చేరుతున్నారు. భారత క్రీడాకారుల మీద అవాకులు, చవాకులు పేలుతున్నారు. తాజాగా బంగ్లా జట్టు కెప్టెన్ నిగర్ సుల్తానా సంచలన వ్యాఖ్యలు చేసింది. 'ఆటగాళ్లను, స్టంప్స్‌ను బ్యాట్‌తో కొట్టేందుకు నేనేమైనా హర్మన్‌ప్రీత్ కౌర్ నా?' అని ప్రశ్నించింది. జట్టులోని జూనియర్ ప్లేయర్లను నిగర్ సుల్తానా కొడుతుందని బంగ్లాదేశ్ పేసర్ జహనారా ఆలమ్ గతంలో ఆరోపించింది. నిగర్ ఈ ఆరోపణలను ఖండించింది. ఈ క్రమంలో టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేరును తీసుకువచ్చింది. 'వ్యక్తిగతంగా నా బ్యాట్‌ను అటూ ఇటూ ఊపవచ్చు. హెల్మెట్‌ను కిందపడేయవచ్చు. అది నా సొంత విషయం. కానీ, ఇంకొకరిపై చేయి ఎందుకు చేసుకుంటాను. గతంలో నేను ఎప్పుడైనా అలా చేశానా?' అని వ్యాఖ్యానించింది. అందరి ముందు తన గురించి జహనారా చెప్పిన తీరు అస్సలు బాగా లేదని చెప్పింది. 'ఆసిస్ లో ఉన్నప్పుడు ఆమెకు ఎవరో ఫోన్ చేసి, నిగర్ సుల్తానా మమ్మల్ని కొట్టి చంపేస్తుంది. మమ్మల్ని రక్షించండి.'అని చెప్పిందంట అని వివరించింది. 'ఇక్కడ లేని వ్యక్తికి చెప్పేబదులు టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఫిర్యాదు చేయవచ్చు కదా? జట్టులో నేనే నియంతనా? ప్లేయర్‌కు ఇబ్బందిగా ఉంటే మేనేజ్‌మెంట్‌కు ఫిర్యాదు చేయకుండా ఎందుకుండాలి' అని నిగర్ ప్రశ్నించింది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఎవరి స్థానం వారికే ఉంటుందని, కెప్టెన్‌గా నాకు కొంచెం గౌరవం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేసింది.

'పాంచ్ మినార్'లో చాలా ఫన్ ఉంటుంది

హీరో రాజ్ తరుణ్

రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పాంచ్ మినార్'. రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ LLP బ్యానర్ పై మాధవి, MSM రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సాంగ్స్, టీజర్, ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. నవంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో రాజ్ తరుణ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

పాంచ్ మినార్ ఎప్పుడు మొదలైంది? ఈ కథ ఎలా ఉండబోతుంది ?

సినిమాని ఈ ఏడాదిలోనే మొదలుపెట్టాం. ఇది ప్రాపర్ క్రైమ్ కామెడీ. కథ నుంచి బయటికి వెళ్లకుండా జానర్ కి తగ్గట్టు ప్రతి సిచువేషన్ లోనూ మంచి ఫన్ ఉంటుంది. స్క్రీన్ ప్లే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. నాకు కథ వినగానే చాలా నచ్చింది. నిర్మాతలు సినిమాకి కావలసిన ప్రతిదీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సమకూర్చారు. మేము అడిగిన ఆర్టిస్టులని ఇచ్చారు. సినిమా మేము అనుకున్నదానికంటే చాలా బెటర్ గా వచ్చింది.

పాంచ్ మినార్ టైటిల్ జస్టిఫికేషన్ ఏమిటి?

ఈ సినిమాలో ఒక కీలక మలుపులో వినిపించే పదం అది. దాంతో కథ ఇంకో మలుపు తిరుగుతుంది. వినడానికి చాలా క్యాచిగా ఉండే పదం కావడంతో టైటిల్ గా పెట్టాం. అంతేగాని పాంచ్ మినార్ అనేది ఒక ఫిజికల్ ఎంటిటీ కాదు.

ఈ కథ, మీ క్యారెక్టర్ గురించి ఒక్క లైన్ లో చెప్పాలంటే?

ఉద్యోగం సంపాదించే క్రమంలో ఈజీగా డబ్బులు సంపాదించాలనుకునే ఓ కుర్రాడు ఎలాంటి సిచువేషన్ లో ఇరుక్కున్నాడు అనేది కథ. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఎంత నలిగిపోతుంటే చూసే వాళ్ళకి అంత నవ్వొస్తుంది. ఇది కంప్లీట్ గా ఫిక్షనల్ స్టోరీ.

గతకొంత కాలంగా మీ నుంచి వస్తున్న సినిమాలు అనుకున్న రీచ్ సాధిస్తున్నాయా?

ఇప్పటివరకు నేను చేసిన సినిమాల ప్రతి కథలో ఒక కొత్తదనం ఉంటుంది. ఏదో కొత్త పాయింట్ చెప్పారు అనే ఫీలింగ్ క్రియేట్ చేస్తుంది. ఈ సినిమాల్లో కూడా అలాంటి ఒక కొత్తదనం ఉంది.నా గత కొన్ని సినిమాల్లో అనుకున్నంత రీచ్ కాలేదు. అయితే దానికి చాలా కారణాలు ఉండొచ్చు. ఈ సినిమా మాత్రం తప్పకుండా ఆడియన్స్ కి రీచ్ అవుతుంది. నాకు నా కెరియర్ విషయంలో ఎలాంటి తొందరపాటు లేదు. నేను గత ఏడాదిన్నరగా కొన్ని ప్రాజెక్ట్స్ చేశాను. అవి ఒక్కొక్కటిగా వస్తున్నాయి.

ఇది క్రైమ్ కామెడీ కదా.. మిగతా క్రైమ్ కామెడీ సినిమాలు కి ఎంత డిఫరెంట్ గా ఉంటుంది?

జానర్ క్రైమ్ కామెడీ నే కానీ ఇది వైలెంట్ ఫిలిం కాదు. ఫ్యామిలీ అందరూ కలిసి ఎంజాయ్ చేసే సినిమాలా ఉంటుంది. ఇందులో మర్డర్ లాంటివి ఉండవు. మోసం చేయడం కూడా క్రైమ్ కిందకి వస్తుంది. అలాంటి ఒక క్రైమ్ చుట్టూ తిరిగే సినిమా ఇది. ఫ్యామిలీ అందరూ కూర్చుని హాయిగా నవ్వుకుంటూ చూడొచ్చు. సినిమా అంతా చాలా మంచి ఫన్ ఉంటుంది. తర్వాత ఏం జరుగుతుందా అనే ఎక్సైట్మెంట్ తో చూస్తారు.

రాశి సింగ్ క్యారెక్టర్ గురించి

రాశి తెలుగు అమ్మాయి కాదు కానీ కష్టపడి తెలుగు నేర్చుకుంది.తన ప్రతి డైలాగు చాలా చక్కగా పలుకుతుంది. ఈ క్యారెక్టర్ లో తను అద్భుతంగా పెర్ఫామ్ చేసింది.



మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర గురించి

శేఖర్ చంద్రతో ఇది నాకు నాలుగో సినిమా. తను నాకు చాలా హిట్ ఆల్బమ్స్ ఇచ్చారు. ఈ సినిమాలో తన బ్యాగ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

నవంబర్ 21న చాలా సినిమాలు ఉన్నాయి కదా.. ఏమైనా ఒత్తిడికి లోనవుతున్నారా?

అన్ని సినిమాలు ఆడాలి. అన్ని సినిమాలో ఆడినప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది. సినిమా బావుంటే ఆడియన్స్ ఎన్ని సినిమాలు చూడడానికైనా ఇష్టపడతారు. బాగున్న సినిమాలన్నీ చూస్తారు.

డైరెక్టర్ గురించి?

ఆయన చాలా సైలెంట్ గా ఉంటారు. కానీ మైండ్ లో చాలా క్లియర్ గా ఉంటారు. క్రైమ్ కామెడీ ఇంత క్లియర్ గా రాయడం అనేది మామూలు విషయం కాదు. జోనర్ నుంచి బయటికి రాకుండా స్క్రీన్ ప్లేని చాలా అద్భుతంగా రాశారు. అలాగే నటీనటుల నుంచి పెర్ఫార్మెన్స్ కూడా అంతే పర్ఫెక్షన్ తో రాబట్టుకున్నారు.

నిర్మాతల గురించి

మాధవి చాలా పాషనేట్ ప్రొడ్యూసర్. కంటెంట్ నమ్మే ప్రొడ్యూసర్. సినిమా అవుట్ పుట్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నారు. తను చాలా ఇన్స్పిరేషన్ పర్సన్. అలాగే గోవింద్ గారు షూటింగ్ సంబంధించిన ప్రతి విషయంలో కేర్ తీసుకున్నారు. సినిమాకి కావలసిన ప్రతిదీ సమకూర్చారు.

మీ జర్నీ పట్ల హ్యాపీగా ఉన్నారా ?

చాలా హ్యాపీగా ఉన్నాను. ఎక్కడో వైజాగ్లో చిన్న కెమెరాలతో షార్ట్ ఫిలిమ్స్ చేసుకునే నేను 20 ఫీచర్ ఫిలిమ్స్ చేశాను. ఇంతకంటే ఏం కావాలి. ఫిలిం మేకింగ్ ప్రాసెస్ ని నేను ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నాను. ఇంకా బెటర్ సినిమాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాను.

మీరు డైరెక్షన్ కూడా చేస్తారని విన్నాం?

నేను కచ్చితంగా డైరెక్షన్ చేస్తాను. అయితే అది ఇప్పుడే కాదు. డైరెక్షన్ చేయాలంటే ఒక రెండు సంవత్సరాలు గ్యాప్ తీసుకోవాలి. దానికి సంబంధించిన ప్రిపరేషన్ చేసుకోవాలి. ఇవన్నీ చేయడానికి కొంత టైం పడుతుంది.

మీ నుంచి కొత్తగా రాబోయే సినిమాలు ఎలా ఉండబోతున్నాయి ?

నిన్న ఓపెనింగ్ చేసిన సినిమా మంచి థ్రిల్లర్. రామ్ భజరంగ్ ఇప్పటివరకు నేను చేసిన సినిమాలో హై యాక్షన్ ఉంటుంది. తెలుగు తమిళ్ లో చేస్తున్న సినిమా కూడా డిఫరెంట్ జానర్ సినిమా.



'12A రైల్వే కాలనీ'పై కాన్ఫిడెంట్ గా వున్నా

ప్రీరిలీజ్ ఈవెంట్ లో అల్లరి నరేష్

హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12A రైల్వే కాలనీ' నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పొలిమేర మూవీ సిరీస్ తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్ గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ.. "64 సినిమాలు చేశా. రిలీజ్ డేట్ దగ్గర పడుతుంటే టాక్ ఏంటి, ఓపెనింగ్స్ ఏమిటి ? ఎలాంటి రివ్యూస్ వస్తాయనే టెన్షన్ గా ఉంటుంది. కానీ నాని ఫస్ట్ సినిమా చేస్తున్నాడు. తనకి ఎక్కడ టెన్షన్ లేదుఇంత కాన్ఫిడెన్స్ గా ఉండడానికి కారణం మా దగ్గర ఉన్న ప్రోడక్ట్ అంత స్ట్రాంగ్ గా ఉంది. నాంది సినిమా చేస్తున్నప్పుడు విజయ్ ఎలా చేస్తాడో అని కన్సర్న్‌తో ఉండేవారు హరీష్ గారు. అలాంటి గురువు ఎవరికైనా ఉండాలి. అనిల్ గారు కూడా నాని ఈ సినిమా చేస్తున్నప్పుడు అంతే కేర్ తీసుకున్నారు. ఇండస్ట్రీలో టాలెంట్ ఉన్న వారిని ఎవరు ఆపలేరు. నేను 35 మంది కొత్త డైరెక్టర్స్ తో పని చేశాను. దాంట్లో చాలా మంది సక్సెస్ అయ్యారు. కొంతమంది అవ్వలేదు. ఒక డైరెక్టర్ అబ్బాయిగా నేను వాళ్ళ అందరితో ఎప్పుడూ ఉంటాను. నేను డైరెక్టర్ ఆర్టిస్ట్ ప్రొడ్యూసర్ ఆర్టిస్ట్ గా ఉండాలనుకుంటున్నాను.ఈ సినిమా చూసిన తర్వాత నా గురించి కంటే భీమ్స్ గురించి ఎక్కువ రాస్తారు. కామాక్షి, అనిల్ ప్రొఫెషనల్ గా డాక్టర్స్. పొలిమేర లాంటి సినిమా చేసి తమను తాము ప్రూవ్ చేసుకుని అంచెలంచెలుగా ఎదిగి ఒక ప్యాషన్ తో వర్క్ చేస్తున్నారు. ఈ సినిమాకి పనిచేసిన అందరూ కూడా సిన్సియర్ గా కష్టపడ్డారు. ప్రొడ్యూసర్ ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమా ఈ సినిమాని తీశారు. నవంబర్ 21న ఈ సినిమా ప్రేక్షకులకు ముందుకు వస్తుంది. తప్పకుండా అందరూ కూడా ఈ సినిమాని థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను"అన్నారు.



#NBK111లో నయనతార

వరుస బ్లాక్‌బస్టర్‌ల దూసుకెళ్తున్న గాడ్ ఆఫ్ ది మాసెస్ నందమూరి బాలకృష్ణ, వీరసింహారెడ్డి సంచలన విజయం తర్వాత బ్లాక్‌బస్టర్ మేకర్ గోపీచంద్ మలినేనితో మరోసారి చేతులు కలిపారు. ఈ ఇద్దరి కొలాబరేషన్ లో హిస్టారికల్ ఎపిక్ #NBK111 చిత్రాన్ని ప్రతిష్టాత్మక వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై ప్రస్తుతం పాన్ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది' సినిమా చేస్తున్న నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మెజెస్టిక్ & మైటీ క్వీన్స్ చాప్టర్ ప్రారంభమైయింది. ఈ హై బడ్జెట్ సినిమాటిక్ స్పెక్టికల్ లో బాలకృష్ణ సరసన హీరోయిన్ గా నయనతార ఈ ప్రాజెక్ట్‌లో చేరారు. ఆమె పాత్ర కథనానికి కీలకం కానుంది. సింహా, జై సింహా, శ్రీ రామరాజ్యం తర్వాత బాలకృష్ణ, నయనతార కలిసి నటిస్తున్న నాల్గవ చిత్రం ఇది. ఈ విజయవంతమైన జంటను మరోసారి తెరపై చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు ఇది ఒక అద్భుతమైన ట్రీట్ లాంటిది. నయనతార పుట్టినరోజు సందర్భంగా ఈ ఎనౌన్స్ మెంట్ చేశారు. మేజెస్టిక్ అనౌన్స్‌మెంట్ వీడియోతో సినిమా అంబిషస్ స్కేలు, విజువల్ స్పెక్టకిల్ అన్నీ అద్భుతంగా చూపించారు. సినిమాకి కావాల్సిన గ్రాండ్ టోన్‌ను ఇది సెట్ చేస్తుంది. డైరెక్టర్ గోపిచంద్ మలినేని నయనతారను గుర్రంపై పరిచయం చేసే విధానం ద్వారా ఈ ప్రాజెక్ట్ ఎంత భారీ స్థాయిలో రూపొందుతోందో స్పష్టమవుతోంది. ఇప్పటివరకు చూడని గ్రాండియర్‌తో విజువల్ వండర్ లా ఈ సినిమా ఉండబోతోంది. గోపిచంద్ మలినేని తొలిసారిగా హిస్టారికల్ డ్రామాలోకి అడుగుపెడుతున్నారు. కమర్షియల్ బ్లాక్‌బస్టర్స్ రూపొందించే తన ప్రత్యేక మాస్ టచ్‌ను ఒక భారీ చారిత్రక కథలో మిళితం చేస్తూ, నందమూరి బాలకృష్ణను ఇప్పటివరకు చూడని ఓ కొత్త అవతార్ చూపించబోతున్నారు. ఇంటెన్స్ ఎమోషన్స్, పవర్ ఫుల్ యాక్షన్, అద్భుతమైన విజువల్స్ కలిసి ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.



'మకుటం' క్లైమాక్స్ షూట్ పూర్తి

వెర్సటైల్ హీరో విశాల్ స్వీయ దర్శకత్వంలో 'మకుటం' చిత్రం రాబోతోంది. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద ఆర్ బి చౌదరి 99వ చిత్రంగా రానున్న ఈ ప్రాజెక్ట్‌కి రవి అరసు కథను అందించారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లు, గ్లింప్స్ సంచలనంగా మారాయి. ఇక తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. వరుసగా 17 రోజుల పాటు నిర్విరామంగా షూటింగ్ చేసినట్టుగా ప్రకటించారు. ఈ మేరకు చిత్రయూనిట్ నుంచి ఓ ప్రెస్ నోట్‌ని కూడా రిలీజ్ చేశారు. అందులో ఏముందంటే.. 'విశాల్ స్వీయ దర్శకత్వంలో రానున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'మకుటం' సినిమాకు సంబంధించిన గ్రాండ్ క్లైమాక్స్ షూటింగ్ పూర్తయింది. 17 రోజులుగా నిర్విరామంగా షూటింగ్ చేశాం. ఇంటెన్స్‌తో కూడిన ఈ క్లైమాక్స్‌ను ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చిత్రీకరించాం. ఓ వార్ సీక్వెన్స్‌కు ఎలాగైతే వందల కొద్దీ స్టంట్ ఆర్టిస్టులతో ఈ క్లైమాక్స్‌ను షూట్ చేశాం. దాదాపు 800 వందల మంది టెక్నీషియన్లతో ఈ షూటింగ్‌ను భారీ ఎత్తున కంప్లీట్ చేశాం' అని అన్నారు. 'మకుటం' మూవీకి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా.. ఎన్.బి. శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. దురైరాజ్ కళా దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం. నాథన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200